RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 82 ISSUE NO : 82 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | ఆదివారం, సెప్టెంబర్, 14 , 2025 Sunday, September,14 , 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## మావోయిస్ట్ అగ్రనేత సుజాతక్క లొంగుబాటు

### ధృవీకరించిన డిజిపి జితేందర్

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతులకల్పన ఎలియాస్ సుజాతక్క తెలం గాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. గద్వాల ప్రాంతానికి చెందిన ఆమె ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న ఏకైక మహిళా నాయకురాలు. పశ్చిమబెంగాల్‌లో 2011 జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత కిషన్‌జీ భార్య ఆమె. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ సౌత్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జిగా ఉన్నట్లు- సమాచారం. సుజాతక్క 106 కేసుల్లో నిందితురాలిగా ఉన్నారు. ఆమెతో పాటు మరికొందరు మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలు స్తోంది. సుజాతక్కపై రూ.కోటి రివార్డు ఉంది. సుజాతక్క లొంగుబాటు వివరాలను డీజీపీ జితేందర్ వెల్లడించారు. ఆమె స్వస్థలంగద్వాల జిల్లా గట్టు-మండలం పెంచికలపాడు. ఆమె మొదట్లో ఆర్‌ఎస్‌యూ, జన నాట్యమండలిలో పని చేశారు. 1996లో కమాండర్‌గా విధులు నిర్వహించారు.



## అది చిన్న విషయం కాదు..

### ఆ నిర్ణయంతో భారత్‌తో సంబంధాలు దెబ్బతిన్నాయి

- భారత్‌పై 50 శాతం సుంకం.. సంబంధాలు దెబ్బతిన్నాయన్న ట్రంప్
- రష్యా నుంచి ఆయిల్ కొనడమే టారిఫ్‌లకు కారణమని వెల్లడి
- ఇది అంత తేలికైన నిర్ణయం కాదని వ్యాఖ్య
- ఈ నిర్ణయం ఇరు దేశాల మధ్య విభేదాలు సృష్టించిందని అంగీకారం
- త్వరలోనే ప్రధాని మోదీతో మాట్లాడతానన్న అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్: రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్నందుకు తాము విధించిన 50 శాతం దిగుమతి సుంకం (టారిఫ్), ఇరు దేశాల మధ్య సంబంధాలను దెబ్బతీసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. ఇది ఇరు దేశాల మధ్య విభేదాలకు కారణమైందని ఆయన తొలిసారి బహిరంగంగా వ్యాఖ్యానించారు. శుక్రవారం ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.
"రష్యాకు భారత్ అతిపెద్ద వినియోగదారు. వారు రష్యా నుంచి చమురు కొంటున్నందుకే నేను 50 శాతం టారిఫ్ విధించాను. ఇది అంత తేలికైన నిర్ణయం కాదు. ఈ నిర్ణయం చాలా పెద్దది. ఇది భారత్‌తో విభేదాలకు దారితీసింది" అని 'ఫాక్స్, ఫ్రెండ్స్' కార్యక్రమంలో ట్రంప్ తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి నేపథ్యంలో పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించగా, వాటిని పక్కనపెట్టి భారత్ చమురు కొనుగోళ్లను కొనసాగించడంతో అమెరికా ఈ కఠిన చర్యలు తీసుకుంది.



## ఈశాన్య భారతం దేశానికే 'గ్రోత్ ఇంజిన్'

- మిజోరంలో రూ. 9,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం
- దేశానికి ఈశాన్య రాష్ట్రాలు వృద్ధి చోదక శక్తిగా మారాయని వ్యాఖ్య
- కీలకమైన బైరబీ-సైరంగ్ రైల్వే ప్రాజెక్టును ప్రారంభించిన ప్రధాని

మిజోరాం : ఢిల్లీ, కోల్‌కతా, గువాహటికి మూడు కొత్త రైలు సర్వీసుల ప్రారంభం
గత ప్రభుత్వాలు ఈశాన్యంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేశాయని విమర్శ

మిజోరాం : ఈశాన్య భారతదేశం ఇప్పుడు దేశానికే ఒక 'గ్రోత్ ఇంజిన్' (వృద్ధి చోదక శక్తి) అని, గత 11 ఏళ్లలో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం మిజోరంలో పర్యటించిన ఆయన, రాష్ట్రంలో రూ. 9,000 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఒకప్పుడు 'సరిహద్దు రాష్ట్రం'గా పిలిచే ఈశాన్యం, ఇప్పుడు దేశానికి 'ఫ్రంట్ రన్నర్'గా మారిందని ఆయన అభివర్ణించారు. ఈ పర్యటనలో భాగంగా అత్యంత కీలకమైన 51.38 కిలోమీటర్ల బైరబీ-సైరంగ్ రైల్వే ప్రాజెక్టును ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు.

- క్యాన్సర్ మందుల ధరలు తగ్గుదలతో ఊరట
- కార్లు, బైకుల ధరలు కూడా తగ్గిస్తూ ప్రకటనలు
- 22 తరవాత సిమెంట్,నిర్మాణ సామాగ్రి ధరలు తగ్గుదల
- భారత ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని సాధించిందన్న ప్రధాని మోడీ



## జిఎస్టీ సంస్కరణలతో ఔషధాల ధరలు తగ్గింపు

న్యూఢిల్లీ, : తమ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సవరణలతో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల మందుల ధరలు తగ్గుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కార్లు, బైక్‌లను తయారుచేసే అనేక కంపెనీలు ఇప్పటికే ధరలను తగ్గించాయని.. సెప్టెంబర్ 22 తర్వాత సిమెంట్ నిర్మాణ సామగ్రి కూడా చౌకగా మారతాయని ప్రధాని తెలిపారు. వివిధ హోటళ్లపై జీఎస్టీని 5 శాతం తగ్గించడం వల్ల పర్యాటకులకు ప్రయోజ నకరంగా ఉంటుందన్నారు.

ఢిల్లీ.:పన్ను చెల్లించే మధ్యతరగతి ప్రజల్లో చాలా మంది సొంతింటి కలలు సాకారం కాకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించింది. ఇళ్ల కొనుగోలుదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అటువంటి వాటిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక నిధి' ఏర్పాటుపై ఆలోచన చేయాలని, అలాంటి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడాన్నీ పరిశీలించాలని కేంద్రానికి సూచించింది. నివాస ప్రాజెక్టు విషయంలో ఓ వివాదానికి సంబంధించిన పిటిషన్‌ను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. రియల్ డెవలపర్ల చేతిలో గృహ కొనుగోలుదారులు మోసపోకుండా లేదా దోపిడీకి గురికాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకునేందుకు ఓ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి, దాన్ని అమలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొంది. దేశ పట్టణీకరణ విధానాలకు అనుగుణంగా ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసేలా చూడాలని స్పష్టం చేసింది. మౌన ప్రేక్షకుడిగా ఉండొద్దు..: రెరా ను 'కోరలు తీసిన పులి'గా మార్చొద్దని, అవసరమైన మౌలిక సదుపాయాలు, ట్రైబ్యునళ్లు, సమర్థమంతమైన యంత్రాంగం ఉండాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. అప్పుడే వారి ఆదేశాలు వేగంగా, కచ్చితంగా అమలు అవుతాయని అభిప్రాయపడింది. ఈ విషయంలో ప్రభుత్వం మౌనప్రేక్షకుడిగా ఉండకూడదని హితవు పలికింది.



## సొంతింటి కలను కాపాడేందుకు 'ఫండ్'

### కేంద్రానికి సుప్రీం సూచన

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** కృష్ణా జలాల విషయం లో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన నీటివాటలో ఒక్క చుక్క నీరు కుడా వదులుకునే ప్రసక్తేలేదని ఆయన తేల్చిచెప్పారు. సెప్టెంబర్ 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు దేశరాజధాని ఢిల్లీలో జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్‌విచారణలో తాను స్వయంగా పాల్గొనబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో 23 నుండి 25 వరకు జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్-2 విచారణలో తెలంగాణ ప్రభుత్వం అనుసరించా ల్సిన అంశంపై శనివారం ఆయన కార్యాలయంలో న్యాయని పుణులు, నీటిపారుదల రంగ నిపుణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఇదే అంశంపై ఒత్తిడి తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకుని ఢిల్లీకి చేరుకుని సమీక్షిస్తారని ఆయన వెల్లడించారు. కృష్ణా జలాశయాలలో తెలంగాణ వాటాను సాధించేందుకు బలమైన వాదనలు వినిపించేందుకు పూర్తి స్థాయిలో అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని వారు ఇచ్చే నివేదికల ఆధారంగా న్యాయవాదులు రాష్ట్రానికి చెందాల్సిన నీటివాటపై వాదనలు వినిపించనున్నారని ఆయన పేర్కొన్నారు. ఎదుట 2025 ఫిబ్రవరి నుండి వాదనలు కొనసాగుతున్నాయని, సమైక్యాంధ్రలో తెలంగాణా ప్రాంతానికి జరిగిన అన్యాయంపై ప్రస్తావించారని ఆయన తెలిపారు.




## వదిలిపెట్టం.. సాధించి తీరుతాం

### మంత్రి ఉత్తమ్ కీలక ప్రకటన



## జూపల్లి కామెంట్స్ పై చర్చోపచర్చలు

**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 13, తెలంగాణ దిశ :** ఏ మనిషినైనా సరే ఆశావహ దృక్పథం ఉండాలి. సాధిస్తాను అనే సంకల్పం ఉండాలి. గెలుస్తాను అని నమ్మకం ఉండాలి. అలా అయితేనే ముందుకు వెళ్ళగలుగుతారు. అలాకాకుండా నిరాశతో, నిస్పృహతో, భయంతో ఉంటే ఎప్పటికైనా సరే ఓడిపోతారు. ప్రస్తుతం 30 లక్షణాలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ఉన్నట్టు కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో నాయకుల్లో ఒక రకమైన భయం కనిపిస్తోంది. గులాబీ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు కాంగ్రె స్లో చేరినప్పటికీ.. ఫిరాయింపుల వ్యవ హారంలో స్పీకర్ నోటీసులు ఇవ్వడంతో ఒక్కసారిగా స్వరం మార్చారు. తాము అభివృద్ధినిధుల కోసం మాత్రమే ముఖ్యమంత్రిని కలిసినట్టు కవరింగ్ ఇచ్చారు. ఇందులో ఇంకా కడియం శ్రీహరి, మరో ఎమ్మెల్యే వివరణ ఇవ్వాల్సి ఉంది.

# మహిళలకు అండ రాచకొండ షీ టీమ్స్




## - రాచకొండ సిపి జి. సుధీర్ బాబు, ఐపిఎస్
## - 15 రోజుల్లో 214 మంది పోకిరీలను పట్టుకున్న రాచకొండ షీటీమ్స్

**రాచకొండ,సెప్టెంబర్ 13, (తెలంగాణ దిశ)** :బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీటీమ్స్ పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ సీపీ జి.సుధీర్ బాబు ఐపిఎస్ తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ షీటీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, బాలికలను, మహిళలను వెంబడించే, వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ.., వారిని, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నారని అన్నారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీటీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు రాచకొండ క్యాంప్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. రాచకొండ కమిషనరేట్ పరిదిలో మహిళలను, యువతులను వేదింపులకు గురిచేస్తున్న 214 (మేజర్స్-94, మైనర్స్-120) మందిని షీ టీమ్స్ పట్టుకున్నారు. వారికి ఎల్‌బి నగర్ సిపి క్యాంప్ ఆఫీస్ (ఉమెన్ సేఫ్టీ ఆఫీసు)లో, కౌన్సిలర్స్ తో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గత నెల తేదీ 16నుండి 31తేదీ వరకు 228 పిర్యాదులు అందాయని తెలిపారు.

### అందిన ఫిర్యాదులలో

ఫోన్ల ద్వారా వేధించినవి -39 , సోషల్ మీడియా యాప్స్ ద్వారా వేధించినవి-86, నేరుగా వేధించినవి%-% 103. వాటిలో క్రిమినల్ కేసులు-5, పెట్టి కేసులు-98, 113 మందికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని విమెన్ సేఫ్టీ వింగ్ డిసిపి టి. ఉషారాణి తెలిపారు.

### ముఖ్యమైన కేసులు కొన్ని...

#### ప్రేమ పేరుతో సహోద్యోగిని వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

షీ టీమ్‌కి అందిన పిర్యాదు మేరకు, యువతి ఉద్యోగం చేస్తున్న సమయంలో, ఆమెతో పాటు పని చేసే వ్యక్తి ముందు ఫ్రెండ్లీగా మాట్లాడి ఆ తర్వాత లవ్ చేస్తున్నానని వెంటపడ్డాడు. ఆ తర్వాత అతని ప్రవర్తన నచ్చక యువతి అతనితో మాట్లాడడం మానేసింది. అయిన అతను వెంటపడుతూ ఆమెకు లెటర్లు పంపిస్తూ ఆమె గురించి చుట్టుపక్కల వారికి చెడుగా ప్రచారం చేయడం మొదలు పెట్టారు. దీంతో విసిగిపోయిన యువతి షి టీమ్ ని సంప్రదించగా నిందితున్ని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ నందు క్రిమినల్ కేసు నమోదు చేసి, నిందితున్ని అరెస్టు చేసి జైలుకు పంపడం జరిగినది.

#### సోషల్ మీడియాలో వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

షీ టీమ్‌కి అందిన ఫిర్యాదు మేరకు, ఒక యువతి ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుంది. గత రెండు సంవత్సరాల నుండి నిందితుడు ప్రేమించమని, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ ద్వారా మెసేజెస్ పంపుతూ వేధిస్తున్నాడు. ప్రేమించక పోతే ఫోటోలను మార్ఫింగ్ చేసి ఆన్ లైన్ పెడతానని, అంతే కాకుండా కుటుంబ సభ్యులకు, బంధువులకు పంపుతానని బెదిరించాడు. ఈ విషయంపై షీ టీం వారిని సంప్రదించగా పోలీస్ స్టేషన్ నందు క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసారు.

#### మహిళను వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

అందిన పిర్యాదు మేరకు ఒక మహిళకు అదే ప్రాంతంలో నివసించే నిందితుడి తో పరిచయం ఏర్పడినది. తరచుగా ఆమెతో మాట్లాడుతుండేవాడు. తరువాత ఆమెకు ఫోన్లు చేస్తూ, ఇబ్బందికరంగా మాట్లాడు తూ, ఆమెను అసభ్యంగా దూషిస్తూ, మానసికంగా వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు ఇట్టి విషయంపై షీ టీం వారిని సంప్రదించగా పోలీస్ స్టేషన్ నందు క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపారు.

#### బస్ స్టాండ్ లో న్యూసెన్స్ పోకిరీలు అరెస్టు

తుక్కుగూడ బస్టాండ్ లో న్యూసెన్స్ చేస్తున్నారని సమాచారం రావడంతో వెంటనే స్పందించిన షీ టీమ్ మహేశ్వరం అక్కడికి చేరుకొని న్యూసెన్స్ చేస్తున్నా యువకులను అదుపులోకి తీసుకొని వారిపై పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేశారు.

#### అవగాహన కార్యక్రమాలు

ఈ నెల తేదీ 16 నుండి 31తేదీ వరకు షీ టీమ్స్ రాచకొండ మొత్తం 86 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, దాదాపు 17210 మందికి మహిళా చట్టాలు, వారి యొక్క హక్కులు, నేరాలు, జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించారు.

#### మెట్రో-రైల్ డెకాయ్ ఆపరేషన్స్

రాచకొండ షీ టీమ్స్ మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి, మహిళా కంపార్ట్ మెంట్ లోకి వెళ్ళి ప్రయాణిస్తున్న (9 )మంది పురుషులను పట్టుకుని మెట్రో స్టేషన్ అధికారుల ద్వారా ఫైన్ వేయించారు.మహిళలు వేధింపులకు గురైనప్పుడు వెంటనే షీ టీంను, రాచకొండ వాట్సాప్ నెంబర్ 8712662111 ద్వారా లేదా ఆ ప్రాంతషీ టీమ్ అధికారుల నంబర్లు భువనగిరి ఏరియా - 8712 662598, చౌటుప్పల్ ఏరియా-8712662599, ఇబ్రహీంపట్నం ఏరియా-8712662600, కుషాయిగూడ ఏరియా -8712662 601,ఎల్ బి నగర్ ఏరియా -8712662602, మహేశ్వరం ఏరియా -8712665299,మల్కాజిగిరి ఏరియా-8712662603, వనస్థలి పురం ఏరియా -8712662604, యాదాద్రి ఏరియా -8712665 300 వాసులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. విమెన్ సేఫ్టీ వింగ్ డి.సి.పి శ్రీమతి టి. ఉషా రాణి, ఎసిపి పల్లె వెంకటేశ్వర్లు, ఇన్ స్పెక్టర్లు ఎం. ముని, జి. అంజయ్య, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది, కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




**మల్లాపూర్, సెప్టెంబర్ 13, (తెలంగాణ దిశ)** : మల్లాపూర్ డివిజన్ అన్నపూర్ణ కాలనీలో శనివారం సీనియర్ సిటిజన్‌లో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సోషల్ జస్టిస్, గవర్నమె ంట్ ఆఫ్ తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అండ్ డిసబిలిటీ ఆఫ్ పర్సన్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆఫ్ ఇండియా సౌజన్యంతో డాక్టర్ షిఫా, నర్స్ శాంతి నేతృత్వంలో సుమారు వందమందిని పరీక్షించి అవసరమైన మం దులు పంపిణీ చేశారు. గత మూడు సంవత్సరాల నుంచి అన్నపూర్ణ కాలనీలో ఈ ఉచిత వైద్య శిబిరా న్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయ కులు నెమలిఅనిల్, కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎస్ఎన్ చౌదరి పాల్గొన్నారు. కాలనీ అధ్యక్షులు డాక్టర్ కటార్ల శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మురుగు నీటి మళ్లింపు "ట్రంక్ లైన్" నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన పీయేసీ చైర్మన్ అరికపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 13, (తెలంగాణ దిశ)** :మురుగునీటి మళ్లింపు "ట్రంక్ లైన్" నిర్మాణ పనులకు శనివారం పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి శంకుస్థాపన చేశారు. రూ. 1.93 కోట్ల వ్యయంతో నిర్మించతలపె ట్టిన కాలువ నిర్మాణ పనులకు మియాపూర్ డివిజన్ పరిధిలోని మక్త మహబూబ్ పేట్ విలేజ్ పెద్ద కుడి చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ముఖ్యంగా చెరువులో మురుగు నీరు కలవకుండా చేపడుతున్న కాలువ నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చైర్మన్ గాంధీ మాట్లాడుతూ మక్త మహబూబ్ పేట్ విలేజ్ చెరువులో కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజీ మళ్లింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, నాణ్యత విషయ ంలో ఎక్కడా రాజీ పడకూడదని గాంధీ సూచించారు. చుట్టుప క్కల కాలనీల నుండి వచ్చే ము రుగు నీరు చెరువులో కలవకుం డా ప్రత్యేక చర్యలు తీసుకోవా లని కోరారు. ప్రజలకు, చెరువు చుట్టు పక్కల నివసిస్తున్న కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. మురుగు నీటి మల్లింపు కాల్వ ద్వార చెరువులో కలుషిత నీరు కలవకుండా సస్యశ్యామలంగా, చక్కటి ఆహ్లాదకరంగా చెరువును పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం, అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం, పునరుద్దరణ పనులు,వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని చైర్మన్ గాంధీ తెలియచేసారు. చెరువు సంరక్షణలోభాగంగా చెరువు చుట్టూ ఫెన్సింగ్ (కంచె) నిర్మాణం, చెరువు అలుగు నిర్మాణం, చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామని అన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలియచేశారు.




# నాగార్జున నగర్ కాలనీలో సమస్యలు పరిష్కరిస్తా



## - బొంతు శ్రీదేవి యాదవ్



**చర్లపల్లి, సెప్టెంబర్ 13, (తెలంగాణ దిశ) :** పరిధిలోని నాగార్జున నగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ హామీ ఇచ్చారు. శనివారం నాగార్జున నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు యావపురం రవి విజ్ఞప్తి మేరకు కాలనీలో పర్యటించారు.
ఈ సందర్భంగా కాలనీ మెయిన్ రోడ్ లో ఏర్పాటు చేసిన మినీ డంపింగ్ యార్డును వేరే చోటుకు మార్చాలని జిహెచ్ఎంసి జవాన్ రాజన్ కు సూచించారు. నాగార్జున నగర్ కాలనీ బస్ స్టాప్ ఏర్పాటుకు సహకరిస్తానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులలోంచి మంజూరైన నాగార్జున నగర్ కాలనీ అంతర్గత రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. 300 మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు మంజూరై పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. కాలనీ అంతర్గత రోడ్లలో ఏర్పడ్డ పాట్ హోల్స్ లో ప్యాచ్ వర్క్ చేయించాలని ఏఈ అభిషేక్ కు సూచించారు. కాలనీలోని ఆరు ప్రధాన రోడ్ల ఎంట్రన్స్ లలో స్ట్రీట్ లైట్లు అమర్చాలని జిహెచ్ఎంసి ఎలక్ట్రికల్ విభాగం అధికారులకు సూచించారు. అదే విధంగా కాలనీలోని పార్కు డెవలప్మెంట్ విషయమై చట్టపరమైన సాధ్యాసాధ్యాలను అధికారుల నుంచి సమాచారం సేకరించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు గోపాల్ యాదవ్ కార్యనిర్వహణ కార్యదర్శి వెంకటేష్ గౌడ్, నాయకులు ప్రకాష్ రెడ్డి, ఉదయ్ చారి, ఈరయ్య యాదవ్, మున్ని, అరుణ, నిర్మల, నవనీత, రమాదేవి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.



**బిఆర్ఎస్ అనాజిపురం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బత్కక అశోక్ సోదరుడు బత్కక నవీన్ యాదవ్ ఇటీవల పరమపదించారు. శనివారం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి తదితరులు వారి నివాసానికి వెళ్ళి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు.**

- (భువనగిరి, తెలంగాణ దిశ)

# సంపాదకీయం

## చంద్రబాబుకు తలొగ్గుతున్న కేంద్రం..!

దొడ్డిదారిన దోపిడీచేయాలి. ఏదో రకంగా డబ్బులు వెనకేసుకోవడం రాజకీయ నాయకులకు అలవాటుగా మారింది. ముఖ్యంగా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల పాలకులు అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నా.. కేంద్రం చోద్యం చూస్తోంది. ఎన్డిఎలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబుకు ఇప్పుడు బిజెపి వంతపాడుతోంది. ఆయన తానా అంటే..కేంద్రం తందానా అంటోంది. కారణం..బాబు ఎంపిల మద్దతుతో ఎన్డిఎ ప్రభుత్వం కొనసాగడమే. చాపకింద నీరులా చంద్రబాబు కూడా తనకు అనుకూలంగా ఉన్న పనులను మెల్లగా కానిచ్చే స్తున్నారు. మోడీ, అమిత్ షాలు కూడా బాబు పురమాయిస్తున్న పనులకు తలూపుతున్నారు. విశాఖ ఉక్కుకు నిధులు కేటాయించారు. పోలవరంకు నిధులు ఇచ్చారు. అమరావతికి నిధులు మంజూరు చేశారు. విశాఖలో యోగా డేను పెట్టి ప్రధానిని రప్పించారు. కేంద్రమంత్రులు ఎపికి వచ్చి వాలుతున్నారు. బాబుతో సంప్రదింపులు చేస్తున్నారు. అశోకగజపతిని గవర్నర్‌ను చేశారు. ఇందులో కొన్ని రాష్ట్ర ప్రయోజనాలకు ఉద్దేశించి నవే. అమరావతిలో ఇప్పటికే 35వేల ఎకరాలు సేకరించినా, అది సరిపోదంటూ..మరింత భూమికి బాబు ఎసరు పెట్టారు. మరో 40వేల ఎకరాల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. విభజన తరవాత తొలి ఐదేళ్ల కాలంలో అమరావతిని పూర్తి చేయలేదు. పోలవరంను పట్టాలకెక్కించలేదు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయలేదు. ఇప్పటికీ వారు కూడు,గూడు కోసం అల్లాడుతున్నా పట్టించుకోవడం లేదు. పోలవరం ఇప్పటికీ పూర్తి కాలేదు. ఎపిలో కలుపుకున్న ఐదు మండలాల సంగతి మాట్లాడడం లేదు. భద్రాచలం ఇవోపై దాడి చేసినా కిమ్మనడం లేదు. పోలవరం ఇంకా పూర్తికాకముందే పోలవరం–బనకచర్ల లింకు ప్రాజెక్టుపై చంద్రబాబు హడావిడి చేస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. నీటి సమస్యలపై ఏనాడూ చర్చలకు పిలవని కేంద్రం చంద్రబాబు చెప్పగానే బనకచర్లపై మాట్లాడుకుందాం రా.. అంటూ తెలంగాణ సిఎంకు కూడా కబురు పెట్టారు. అసలు నీటి సమస్యలు పక్కకు పోయాయి. కొత్తగా బనకచర్లపై కేంద్రం కూడా గంగిరెద్దులా తలూపుతోంది. అసలు ఈ ప్రాజెక్టు సాధ్యమా కాదా అన్న కోణంలో ఎవ్వరూ ఆలోచించడం లేదు. ఆలోచిస్తే ఎక్కడ తమ పీఠాలు కదులుతాయో అని బిజెపి నేతలు భయంతో ఉన్నారు. తెలంగాణ ప్రాజెక్టులపై మాత్రం మాట్లాడడం లేదు. కాళేశ్వరం అక్రమాలపై మాట్లాడిన వారు చర్యలు తీసుకోవడం లేదు. అసలు చంద్రబాబు చేస్తున్న హడావిడి అంతా చూస్తుంటే బనకచర్ల మరో కాళేశ్వరంగా మారడం ఖాయమని చెప్పవచ్చు. కేవలం డబ్బుల కోసమే ఈ ప్రాజెక్టుపై తెగ ప్రచారం చేస్తున్నారని చెప్పవచ్చు. ఎందుకంటే ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల అప్పులపాలైన ఏపీ సర్కారు, బనకచర్ల కోసం మరో రూ. 82వేల కోట్ల అప్పు చేసేందుకు ఎందుకు తెగిస్తోందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అసలు అక్కడ వరద జలాలే లేవని కేంద్ర సంస్థలు చెబుతున్నా.. ఈ ప్రాజెక్ట్ మరో కాళేశ్వరంలా మారి, ఏపీ పాలిట తెల్ల ఏనుగు అవుతుందని అక్కడి ఇరిగేషన్ నిపుణులు, మేధావులు హెచ్చరిస్తున్నా చందరబాబు మాత్రం ఎక్కిడికి వెళ్లినా బనకచర్ల అంటూ తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు. మిగులు జలాలు అంటూ పలవరిస్తున్నారు. దీని వెనుక అసలు కారణం వేరే ఉందనే వాదన వినిపిస్తున్నది. గతంలో తెలంగాణలో కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి లాంటి కీలక ప్రాజెక్టులతో పాటు అటు– ఏపీలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ లాంటి భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టి లక్షల కోట్లు సంపాదించిన ఓ బడా కాంట్రాక్ట్ సంస్థే.. ఇప్పుడు ఈ బనకచర్ల ప్రాజెక్టునూ చేపట్టేందుకు ముందుకు వచ్చినట్లు తెలిసింది. అవసరమైతే తెలంగాణ ప్రభుత్వాన్ని ఒప్పిస్తానని ఆ కాంట్రాక్ట్ సంస్థ ఆఫర్ ఇచ్చినట్లు అక్కడి అధికార, రాజకీయ, మేధావి వర్గాల్లో చర్చ జరుగుతున్నది. మొత్తమ్మీద 40,500 ఎకరాల వ్యవసాయ భూములు, 17 వేల ఎకరాల అటవీ భూములు సేకరించి, 18 గ్రామాలను ముంచి, 10 లిఫ్టులు పెట్టి, నెలనెలా కరెంట్‌కు వేల కోట్లు– ఖర్చు పెడ్తూ 575 కిలోమీటర్లకు గోదావరి నీళ్లు ఎత్తిపోయడం అసాధ్యమని వేరుగా చెప్పనక్కరలేదు. ఎందుకంటే కాళేశ్వరంలో ఇలాగే జరిగింది. మహాద్భుత కట్టడంగా ఆనాడు కెసిఆర్ ప్రచారం చేసి లక్షకోట్లు తగలేశారు. గోడకేసిన సున్నంలా చేశారు. కేవలం తమవారి, తన పొలాలు పారించుకునేలా కాళేశ్వరం డిజైన్ చేసుకున్నారు. ఈ విమర్శలపై ఆరోపణలు వచ్చినా పెద్దగా విచారణ సాగడం లేదు. కాళేశ్వరంలో ఎవరు ఎంత తిన్నారో కానీ అధికారులు మాత్రం కోట్లకు పడగ లెత్తారు. ఇందులో భాగస్వాములు అయిన అధికారులు ఎసిబికి చిక్కి కేసులు ఎదుర్కొంటున్నారు. ఊచలు లెక్క పెడుతున్నారు. ఇకపోతే బనకచర్ల పేరుతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేసి, శ్రీశైలం నుంచి కృష్ణా నీటిని మళ్లించే ఎత్తుగడ కూడా ఇందులో దాగివుందని స్పష్టమవుతున్నది. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో కెసిఆర్ అవలంబించిన విధానాలనే బనకచర్ల ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు ఫాలో అవుతున్నారని అనిపిస్తోంది. 10 లిఫ్టులు, 38 కిలోమీటర్ల పొడవైన సొరంగాల ద్వారా 575 కిలోమీటర్ల దూరంలో ఉన్న బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు గోదావరి నీళ్లను తరలించేలా పీబీ లింక్ ప్రాజెక్టును రూ.82 వేల కోట్లతో నిర్మించాలని ఏపీ నిర్ణయించింది. ఇది అంచనా మాత్రమే. ప్రాజెక్టు పూర్తయ్యే సరికి మొత్తం ఖర్చు రూ.లక్ష కోట్లు– దాటనుంది. ఈ క్రమంలో ఇప్పటికే పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు నీళ్లను తరలించే సెగ్మెంట్ పనులకు టెండర్లను పిలిచేందుకు ఏపీ సర్కారు రెడీ అవుతోంది. పనిలో పనిగా సెగ్మెంట్ పనులను సైతం సమాంతరంగా చేసే అంశంపైనా కసరత్తు చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలక పనులు దక్కించుకున్న ఓ బడా కాంట్రాక్ట్ సంస్థే బనకచర్ల మెయిన్ వర్క్స్ చేపట్టేందుకు ముందుకు వచ్చి నట్లు తెలిసింది.దాదాపు రూ.50 వేల కోట్ల పనులను అప్పనంగా పంచే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ ఏపీ అధికార, రాజకీయ, మేధావి వర్గాల్లో జరుగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో దాదాపు 56 సబ్ కాంట్రాక్ట్ పనులను ఆనాటి బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిందని కాళేశ్వరం కమిషన్ విచారణలో ఇప్పటికే తేలింది.ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలోనూ అదే రీతిలో సబ్ కాంట్రాక్టుల దందాకు తెరలేపు తున్నట్టు తెలుస్తోంది. లక్షల కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు నిర్మించినా ప్రయోజనం ఉండదని మేధావులు సైతుఅంగీకరిస్తున్నారు. పోలవరం పూర్తయితే తప్ప నీటి చుక్క కూడా తరలించే పరిస్థితి లేనప్పటికీ చంద్రబాబు మాత్రం బనకచర్ల ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేస్తానని చెప్పడంపై ఏపీలో ఇరిగేషన్ నిపుణులు, మేధావులు, ఆర్థికవేత్తల నుంచి విస్మయం వ్యక్తమవుతోంది. ఈ క్రమం లోనే బనకచర్లకు వ్యతిరేకంగా విజయవాడ కేంద్రంగా ఇటీవల ఆలోచనాపరుల వేదిక పురుడుపోసు కుంది. ఈ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వేదిక బాధ్యులు మాజీ డీజీపీ ఏబీ వెంకటేశ్వర్రావు, కంభంపాటి పాపారావు, అక్కినేని భవాని ప్రసాద్, టి.లక్ష్మి నారాయణ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు.

# నాగారం మున్సిపల్ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి




**- సమస్యల పరిష్కారం కోసం అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలు**
**- జేపీసీ, అఖిలపక్ష రాజకీయ కమిటీ సమావేశంలో నిర్ణయం..**

**నాగారం, సెప్టెంబర్ 13, (తెలంగాణ దిశ) :** నాగారం మున్సిపల్ సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జేఏసీ, అఖిలపక్ష రాజకీయ కమిటీ సూచించింది. శనివారం ఎంవైఆర్ గార్డెన్స్‌లో జేఏసీ అఖిలపక్ష కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీనివాస్, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాయినాథ్ గౌడ్, బిజెపి మాజీ అధ్యక్షుడు కేశవ్ రెడ్డి, జెఎసి అధ్యక్షుడు జయకుమార్, జెఎసి ఉపాధ్యక్షుడు పి. జితేందర్ రెడ్డి, జెఎసి ప్రధాన కార్యదర్శి జి. కమలాకర్, టిడిపి అధ్యక్షుడు జంగా రెడ్డి, టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమా మహేశ్వర్, జన సమితి అధ్యక్షుడు సి. శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని మెరుగు పర్చడంపై దృష్టి సాధించాలని నిర్ణయించారు. మూడు గంటలకు పైగా జరిగిన సమావేశంలో అనేక కీలక అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా గుర్తించిన సమస్యలను అధికారులకు నివేదించాలని తీర్మానించారు. నాగారం రాంపల్లి రోడ్డు విస్తరణ పనులతో సంబంధం లేకుండా, అన్ని రోడ్లు, గుంతలను వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు. అదేవిధంగా శిల్పా లే అవుట్‌ను ప్రధాన రహదారికి కలిపే యు–టర్న్‌ను సజావుగా యాక్సెస్ కోసం మార్చడం, ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని కోరారు. నాగారం జంక్షన్ వద్ద కీసర–నాగరం ప్రధాన రహదారి నుండి ప్రయాణించే వాహనాల కోసం ఉచిత ఎడమ మలుపు ప్రవేశపెట్టాలని సూచించారు. ప్రారంభ స్థానం వద్ద శిల్పా నగర్ రహదారి ఇరుకైన ప్రాంతం నుండి మంగళవారం మార్కెట్‌ను మార్చాలని కోరారు. మంగళవారం మార్కెట్‌ను పూర్తిగా తరలించడానికి వీలుగా శిల్పా నగర్‌లోని వాటర్ ట్యాంక్ సమీపంలో నిర్మాణంలో ఉన్న మార్కెట్‌ను వేగవంతం చేయాలని కోరారు. ఎస్వీ నగర్ బస్ స్టాప్ ను పునరుద్ధరించాలని కోరారు. అన్ని డ్రైనేజీ వ్యవస్థలను పక్షం రోజులకోసారి శుభ్రం చేయాలని కోరారు. దెబ్బతిన్న డ్రైనేజీ మరమత్తు చేయాలని, అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. 22 కాలనీల నివాసితులను వారి కష్టాల నుండి కాపాడటానికి ప్రధాన రహదారి మీదుగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. అన్ని కాలనీలలో అవసరమైన వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీధి కుక్కల బెడదను పరిష్కరించాలని కోరారు. దాయార్ కుంట సరస్సును సుందరీకరణ చేయాలని, పాదచారుల ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన హాకర్లను తొలగించాలని కోరారు. మున్సిపల్ సమగ్ర అభివృద్ధి కోసం తరచూ సమావేశాలు నిర్ణయించి అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలని తీర్మానించారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే అఖిలపక్ష కార్యాచరణ కమిటీ పేరుతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.



# ఈ ఏడాది చివరి సూర్యగ్రహణం ఎప్పుడో తెలుసా..?



## ఈ విషయాలు గుర్తుంచుకోవాల్సిందే..!

ఈ ఏడాది రెండో, చివరి సూర్యగ్రహణం సెప్టెంబర్‌లో ఏర్పడనున్నది. సూర్యగ్రహణం కేవలంలో ఖగోళ ఘటన కాగా.. జ్యోతిషశాస్త్రం పరంగా ప్రాధాన్యం ఉంటుంది. సాంప్రదాయ నమ్మకాల ప్రకారం సూర్యగ్రహణం కాలంశుభకరంగా ఉండదు. అందుకే ఆ సమయంలో తినడం, నిద్రపోవడం, పూజలు చేయడం, ఇతర శుభకార్యాలు చేయరు. ముఖ్యంగా గర్భిణులు ఈ సమయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే, ఈ సూర్యగ్రహణంలో భారత్‌లో కనిపిస్తుందా? సూతకం ఉంటుందా? గ్రహణ సమయంలో ఏం చేయాలి.. ఏం చేయకూడదు ఇలా అనేక సందేహాలు ఉంటాయి. ఈ ఏడాది చివరి గ్రహణం భారతకాలమానం ప్రకారం సెప్టెంబర్ 21న రాత్రి 11 గంటలకు ప్రారంభమై.. సెప్టెంబర్ 22న ఉదయం 3.24గంటలకు ముగుస్తుంది. సుమారు 4.24గంటల పాటు గ్రహణం కొనసాగుతుంది. అయితే, సూర్యగ్ర హణంలో భారత్‌లో కనిపించదు. దాంతో సూతకం పాటించాల్సిన అవసరం ఉండదు. భారత కాలమానం ప్రకారం రాత్రి సమయంలో గ్రహణం ప్రారంభంకానుండడంతో కనిపించేందుకు అవకాశం లేదు. ఈ గ్రహణం ప్రధానంగా అమెరికా, ఆస్ట్రేలియా, ఫిజీ, న్యూజీలాండ్, అట్లాంటిక్ మహాసముద్రం ప్రాంతాల్లో కనిపిస్తుంది.

సూర్యగ్రహణ సమయంలో ఏం చేయకూడదు..?:

గ్రహణ సమయం లో పూజలు, మంత్ర పఠనం, ఇతర ధార్మిక కార్యక్రమాలు చేయకూ డదు. ఎందుకంటే ఈ సమయం శుభసమయం కాదు. సూతకం ప్రారంభమైన వెంటనే ఇంట్లో వంటిన అన్ని ఆహార పదార్థాల్లో తులసి ఆకులు వేసి ఉంచాలి. తద్వారా గ్రహణ దుష్ప్రభావం ఉండదు. ఈ సమయంలో ఇంట్లోని దేవతాచిత్రపటాలు, పూజాసామగ్రి ముట్టడం నిషిద్ధం. గ్రహణ సమయంలో తినడం, నిద్రపోవడం మంచిది కాదు. ఎందుకంటే శక్తులు అసమతుల్యంగా ఉంటాయి. గర్భిణులు గ్రహణ సమయం ఇంట్లోనే ఉండాలి. బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలి. సీసాలు, కత్తులు, సూదులు వంటి వస్తువులను ఈ సమయంలో వాడకూడదు. ఈ సమయంలో అనవసర పనులు, ప్రయాణాలు, కొత్త పనులు చేపట్టడం వల్ల దుష్ప్రభావాలు ఉండే అవకాశం ఉంది.

# క్యూఆర్ కోడ్ తో గంగిరెద్దు గంగయ్య బిక్షాటన



డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయిన నేపథ్యంలో భిక్షాటనకు బయలు దేరిన ఒక గంగిరెద్దు వ్యక్తి క్యూఆర్ కోడ్‌తో బిక్షాటన చేయడం ఆసక్తిగా మారింది. అందరూ చిల్లర లేదు..., మళ్ళీ రమ్మంటున్నారని..
ఏకంగా క్యూఆర్ కోడ్ తో భిక్షాటన ప్రారంభించినట్లు శనివారం మల్కాజిగిరి మధుసూదన్ నగర్ నగర్ లో తారస పడిన గంగిరెద్దుతో భిక్షాటన చేస్తున్న మేడ్చల్ తూప్రాన్ కు చెందిన గంగయ్య స్పష్టం చేశారు. గంగిరెద్దు నుదుటిపై క్యూఆర్ కోడ్ ను తగిలించడంతో అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

– (మల్కాజిగిరి, తెలంగాణ దిశ)

# బూస్టర్ లా భోగాపురం

**విజయనగరం, తెలంగాణ దిశ:** విజయనగరం జిల్లాలో నిర్మాణంలో ఉన్న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్ పూర్తయితే.. ఉత్తరాంధ్ర రూపురేఖలే మారిపోనున్నాయ్. భోగాపురంలో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. ఆ ప్రాంతమే కాదు చుట్టపక్కల ఉన్న మిగతా ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయ్. ఈ ప్రాజెక్టుతో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాదు.. పారిశ్రామిక, ఆర్థిక, సామాజిక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు బీజం పడనుంది. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం.. అదే.. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్.. విజయనగరంలో జిల్లాలో ఈ విమానాశ్రయం పూర్తయితే.. ఉత్తరాంధ్ర లెక్కే మారిపోతుందనే మాటలు వినిపిస్తున్నాయి. అటు విశాఖ, ఇటు శ్రీకాకుళానికి మధ్య ఉన్న విజయనగరాన్ని కలిపేలా.. ఈ ఎయిర్‌పోర్ట్‌ని నిర్మిస్తున్నారు. ఎన్‌హెచ్–16కి ఆనుకొని దీనిని నిర్మిస్తుండటం.. మరో మేజర్ ప్లస్ పాయింట్. ఇప్పటికే.. ఎయిర్‌పోర్ట్ పనులు సుమారు 80 శాతం వరకు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి.. భోగాపురం ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తీసుకురావాలని.. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

కూటమి ప్రభుత్వం వచ్చాక ఎయిర్‌పోర్ట్ పనుల్లో కదలిక. ఎయిర్‌పోర్ట్ పనులు వేగంగా సాగుతుండటంతో.. పదేళ్లుగా పడకేసిన రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణ ప్రతిపాదన వచ్చింది. దాంతో.. రియల్టర్లంతా పెద్ద ఎత్తున లేఅవుట్‌లు వేసుకున్నారు. తర్వాత వైసీపీ హయాంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్వశ్చన్ మార్క్‌లా మారింది. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక.. విమానాశ్రయ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతుండటంతో.. రియల్టర్లలో మళ్లీ ఆశలు చిగురించాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుతో.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం వల్ల ఉద్యోగ అవకాశాలు భారీగా పెరగనున్నాయి. ఎయిర్‌పోర్ట్ మెయింటెనెన్స్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, రిటైల్ లాంటి రంగాల్లో.. వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. పారిశఅరామికంగా, విమానాశ్రయానికి సమీపంలో కొత్త పరిశ్రమలు, గోడౌన్‌లు, వ్యాపార సంస్థలు ఏర్పడతాయి. ఇది.. ఆ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థని బలోపేతం చేస్తుందని చెబుతున్నారు. ఉత్తరాంధ్రలో ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ముందుకు. ఇదిలా ఉంటే.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్యూచర్ అంతా టూరిజందే అంటున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో.. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లను కోరుతున్నారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల తీర ప్రాంతాల్లో.. టూరిజాన్ని డెవలప్ చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఫైవ్ స్టార్ హోటళ్ల నుంచి బీచ్‌లో కాటేజీల దాకా అన్నింటిపైనా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

టూరిజంతో పాటు ఐటీ సెక్టార్, ఇంజనీరింగ్ పరిశ్రమల్ని అభివృద్ధి చేసి.. ఉత్తరాంధ్రలో ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతోంది కూటమి ప్రభుత్వం.భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. ఉత్తరాంధ్రలో టూరిజం బాగా డెవలప్ కానుంది.విజయనగరం జిల్లా సమీపంలోని టూరిస్ట్ స్పాట్‌లకు.. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల రాకపోకలు పెరుగుతాయి. దాంతో.. హోటల్స్, రిసార్ట్స్, రెస్టారెంట్ల లాంటి హాస్పిటాలిటీ రంగం డెవలప్ అవుతుంది. మౌలిక సదుపాయాల కల్పనలోనూ ఊహించని మార్పులొస్తాయ్. రోడ్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, కరెంట్ సప్లై లాంటివన్నీ మెరుగుపడతాయి. మొత్తంగా.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ విజయనగరం జిల్లాని ఓ ముఖ్యమైన ఎకనమిక్ జోన్‌గా మార్చి.. ఆ ప్రాంత సమగ్ర అభివృద్ధికి బూస్టర్‌లా మారనుంది



**భువనగిరి మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు గొమారి సుధాకర్ రెడ్డి తండ్రి గొమారి ఆదిరెడ్డి శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, భువనగిరి పట్టణ హుస్నాబాద్ లోని వారి నివాసానికి వెళ్ళి ఆదిరెడ్డి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేశారు.**

- (భువనగిరి, తెలంగాణ దిశ)

# భారీగా తగ్గిన బియ్యం ధరలు



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** తెలంగాణలో సన్న బియ్యం ధరలు భారీగా తగ్గాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రేట్లు అమాంతం దిగి వచ్చాయి. గతంలో క్వింటా రూ.5-6వేల మధ్య పలికిన ధరలు, ప్రస్తుతం భారీగా తగ్గాయి. క్వింటా సన్నబియ్యం రూ.4- 4,500 వేల మధ్య దొరుకుతున్నాయి. సన్న వడ్లకు సర్కార్ బోనస్ ప్రకటించ టం, రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం, మూడు నెలల రేషన్ కింద సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేయడంతో మార్కెట్‌లో బియ్యం ధరలు గణనీయంగా తగ్గాయి.రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ సన్న వడ్లపై రూ.500 బోనస్ ప్రకటించడంతో సన్న వడ్ల సాగు విస్తీర్ణం దాదాపు రెట్టింపు అయింది. దీంతో ధాన్యం దిగుబడి భారీగా పెరిగి, సప్లై కూడా పెరిగింది. ఇది ధరలపై ప్రభావం చూపింది. రాష్ట్రవ్యాప్తంగా 2.60 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులకు 17,349 రేషన్ షాపుల ద్వారా గత నెలలో మూడు నెలలకు సంబంధించి 4.73 లక్షల టన్నుల సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ భారీ పంపిణీ కారణంగా బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం డిమాండ్ గణనీయంగా తగ్గింది.దానికి తోడు తమిళనాడు, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల నుండి సన్న బియ్యం ఆర్డర్లు తగ్గడం కూడా ధరల పతనానికి మరో కారణమని వ్యాపారులు చెబుతున్నారు.కాగా, జూన్ నుంచి క్రమంగా బియ్యం ధరలు తగ్గుతున్నాయి. జూలై మొదటి వారంలో మరింత పడిపోయాయి. గత ఏడాది క్వింటాల్ రూ.5,600 ఉన్న హెచ్‌ఎంటీ రకం బియ్యం ధర ఇప్పుడు రూ.4,600కు తగ్గింది. కర్నూల్ మసూరి రకం రూ.4,000కు చేరుకోగా, జై శ్రీరాం రకం రూ.5,800 నుంచి రూ.4,600కు పడిపోయింది. ఆర్‌ఎన్‌ఆర్, సాంబా రకాల ధరలు కూడా క్వింటాల్ రూ.1,000 వరకు తగ్గాయి.తగ్గిన ధరలు మధ్యతరగతి వినియోగదారులకు ఎంతో ఊరట కలిగిస్తున్నాయి. రేషన్ కార్డులు లేని సుమారు 30 లక్షల కుటుంబాలకు, నెలకు 60 వేల టన్నుల బియ్యం అవసరం ఉ oడగా.. వారికి ఈ ధరల తగ్గదల లాభదాయకంగా మారింది. అయితే, బహిరంగ మార్కెట్‌లోని బియ్యం వ్యాపారులకు గిరాకీ 20 శాతానికి పైగా పడిపోయింది. తగ్గాయని, కొన్ని ప్రాంతాల్లో బోనీ కూడా లేదని వ్యాపారులు వాపోతున్నారు. గతంలో నెలకు 250 క్వింటాళ్ల బియ్యం అమ్మిన షాపులు ఇప్పుడు 100 క్వింటాళ్లు కూడా అమ్మలేని పరిస్థితి నెలకొందని రామంతపూర్‌కు చెందిన ఓ హోల్‌సేల్ వ్యాపారి ఆందోళన వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ టిక్కెట్లపై 100 వరకు తగ్గింపు




**అనంతపురం, తెలంగాణ దిశ :** ఏపీఎస్‌ఆర్టీసీ ప్రయాణికులకు బంపరాఫర్ ప్రకటించింది.. బస్ ఛార్జీలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అనంతపురం నుంచి కొన్ని ప్రధాన నగరాలకు వెళ్లే బస్సులు ఛార్జీలను తగ్గించారు. ఈనెల 31 వరకు తగ్గింపు ఛార్జీలు అమల్లో ఉంటాయని.. వెన్నెల ఏసీ, స్లీపర్ బస్సుల్లో 20 శాతం, ఇంద్ర బస్సులకు 15 శాతం ఛార్జీలు తగ్గించినట్లు తెలిపారు. అనంతపురం నుంచి హైదరాబాద్, చెన్నై, తిరుపతి, విజయవాడకు ఈ ఛార్జీలు తగ్గించామన్నారు. అనంతపురం నుంచి వెళ్లడంతో పాటుగా తిరుగు ప్రయాణంలో కూడా ఈ ఛార్జీలు వర్తిస్తాయన్నారుతాడిపత్రి నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు గతంలో బస్ ఛార్జీ రూ.1105 ఉంటే.. తాజాగా ఆ రేటు రూ.884కు తగ్గించారు. అలాగే అనంతపురం నుంచి విజయవాడ వెళ్లేందుకు గతంలో రూ.961 ఉంటే.. తాజాగా రూ.817కు తగ్గించారు. అనంతపురం నుంచి చెన్నైకు గతంలో రూ.832 ఉంటే.. తాజాగా దానిని రూ.708కు తగ్గించారు. అనంతపురం నుంచి తిరుపతికి గతంలో రూ.579 ఉంటే.. తాజాగా ఆ ధరను రూ.493కు తగ్గిస్తూ ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అంటే ఒక్కో రూట్‌లో రూ.100 నుంచి రూ.150 వరకు ఛార్జీలను తగ్గించింది ఆర్టీసీప్రైవేటుకు దీటుగా ఆర్టీసీ ఆదాయ మార్గాలను పెంచుకొనే క్రమంలో వెళ్లేందుకు ఛార్జీలను తగ్గించినట్లు ఆర్ఎం సుమంత్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఆషాఢమాసం కావడంతో పెద్దగా ప్రయాణికుల రద్దీ ఉండకపోవడంతో.. ఆర్టీసీకి ఆదాయం పెంచే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నామన్నారు. ఆర్టీసీ తీసుకున్న ఈ నిర్ణయంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఊరట లభించింది అని చెప్పాలి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.అనంతపురం మాత్రమే కాదు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోని ఆయా డిపోల్లో బస్ ఛార్జీలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏసీ బస్సుల్లోనే ఎక్కువశాతం ఛార్జీలను తగ్గించారు. ఆ డిపోలో నుంచి హైదరాబాద్ సహా ప్రధాన నగరాలకు వెళ్లే బస్సుల టికెట్ ధరలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు.

# శానిటేషన్ సంగతి అంతేనా?

**కరీంనగర్,, తెలంగాణ దిశ :** కరీంనగర్ నగరపాలక సంస్థ దిన దినం విస్తరిస్తుండగా పారిశుధ్య సమస్య రోజు రోజుకు పెరిగిపోతున్నది. శివారు గ్రామాలు విలీనం కావడంతో గతంలో ఉన్న 60 డివిజన్లు 66 గా మారాయి. ప్రస్తుతం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని కీలకమైన పారిశుధ్య వి భాగం ఒక ఔట్ సోర్సింగ్ అధికారి చేతిలో ఉంది. ఒకప్పుడు పారిశుధ్య విభాగంలో అవార్డులు అందుకున్న కరీంనగర్ నగరపాలక సంస్థ నేడు అస్తవ్యస్తంగా మారింది. నగరపాలక సంస్థ పరిధిలో 92 మంది ఉద్యోగులు పారిశుధ్య విభాగంలో పనిచేస్తుండగా 1100 మంది వరకు ఔట్ సో ర్సింగ్ కింద పనిచేస్తున్నారు. ప్రతి డివిజన్ ఒక జవాను, జవాను కింద 11 నుంచి 15 మంది వరకు పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. జవాన్లపైన సానిటరీ ఇన్స్పెక్టర్లు పని చేస్తున్నారు. అయితే ఒకరిపై ఒకరి నియంత్రణ కొరవడడంతో పారిశుధ్య విభాగం అస్త వ్యస్తంగా మారి నగరంలో పారిశుధ్యం పడకేసింది. మొన్నటి వరకు పాలకవర్గం ఉండగా ఆయా డివిజన్ల పరిధిలో కార్పొరేటర్లు తమ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రయత్నించేవా రు.ఇప్పుడు డివిజన్ల వారీగా ని యమించిన అధికా రులు ఇతర విభాగాలకు చెందినవారు కావడం, వారు త మ తమ శాఖల్లో తలమునకలై ఉంటుండడంతో డివిజన్లలో పారిశుధ్య పనులు పర్య వేక్షించేవారు కరువయ్యారు. జవాన్లు ఉద యం 7 గంటల నుంచి కార్మికులు పని దిగే వరకు నాలుగు పర్యాయా లు అటెండెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ అటెండెన్స్ విధానానికి జవాన్లు స్వస్తి పలికి కొన్ని చోట్ల ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తూ పారిశుధ్య ఆటో నిర్వాహకుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుకున్నాయి.కార్మి కులు ఇదేమని అడిగితే ఉద్యోగాల నుండి తీసివేస్తూ భయ భ్రాంతులను సృష్టిస్తున్నారు. నె ల రోజుల క్రితం ముగ్గురు కార్మికులను తొలగించగా బీఆర్టీయూ కార్మిక సం ఘం ఆధ్వర్యంలో ఆందోళన చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. మీరు ఆందోళన చేస్తున్నా రు కనుక మిమ్ములను తీసుకోమని అధికారులు హెచ్చరిస్తుండడంతో కార్మికులు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమవుతు న్నారు.గతం లో సానిటేషన్ విభాగం ఆ శాఖ పరిధి అధికారుల చేతిలో ఉండేది. గత కమిషనర్ ఔట్ సోర్సింగ్ విభాగానికి చెందిన ఒక అధికారికి అప్పజెప్పి ఫుల్ పవర్స్ ఇచ్చారు. ప్రస్తుతం ఆయన కిందే సానిటేషన్ విభాగం ఉంది. డీజిల్ కూపన్ల జారీ నుండి పారిశు ధ్య విభాగాన్ని ఆయనే పర్యవేక్షిస్తుంటారు. కొందరు జవాన్లు డబ్బులు వసూలు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆ అధికారిని తప్పుదోవ పట్టిస్తుండ డంతో పారిశుధ్యంపడకేసింది. ఏఈ స్వామిదే బాధ్యత. తొలగించిన పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకుని ఈ విభాగాన్ని చక్కదిద్దాలి. పారిశుధ్య విభాగంలో కార్మికుల సమస్యలను పరిష్కరించి తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోకుంటే సమ్మెబాట పట్టవలసి ఉంటుంది.


# ఏపీలో వారందరికి సంక్షేమ పథకాలు కట్..

**విశాఖపట్టణం, తెలంగాణ దిశ :** ఏపీలో వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిలిపివేసే ఆలోచనలో ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన వారికి పథకాలు రావన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. గతంలో 20 వేల ఎకరాల్లో గంజాయి సాగు జరిగేదని, ప్రస్తుతం అది 90 ఎకరాలకు తగ్గిందని వివరించారు. గిరిజనులకు ఉపాధి కల్పించడానికి పండ్ల మొక్కలు ఇవ్వాలని నిర్ణయించామని ఆమె పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం త్వరలో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ఈగల్ ఐజీ రవికృష్ణ తెలిపారుఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారందరికి సంక్షేమ పథకాలను నిలిపివేసే ఆలోచనలో ఉందన్నారు హోంమంత్రి వంగలపూడి అనిత. ఇకనైనా పద్దతి మార్చుకుంటే బావుంటుందని వార్నింగ్ ఇచ్చారు. అనవసరంగా జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. హోంమంత్రి అనిత, ఈగల్ ఐజీ రవికృష్ణ అమరావతి సచివాలయంలో మాట్లాడారు.. కీలక వ్యాఖ్యలు చేవారు. ఏపీని గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని.. ఆ దిశగా మార్చడానికి కృషి చేస్తున్నామని.. గంజాయి కేసులో పట్టుబడిన వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిలిపివేసే ఆలోచనలో ఉంది అన్నారు. గంజాయి సాగును అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. గిరిజనులకు ఉపాధి కల్పించడానికి పండ్ల మొక్కలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు.రాష్ట్రంలో గంజాయి సాగును తగ్గించామన్నారు హోంమంత్రి అనిత.

గతంలో 20 వేల ఎకరాల్లో గంజాయి సాగు జరిగేది.. ఇప్పుడు అది 90 ఎకరాలకు తగ్గిందని వివరించారు. త్వరలోనే గంజాయి సాగును పూర్తిగా నివారిస్తామని.. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది అన్నారు. ఈ ఏడాది 2 కోట్ల పండ్ల మొక్కలు ఇవ్వాలని నిర్ణయించారన్నారు. 'గత ఏడాది కాలంలో 831 కేసుల్లో 2,114 మందిని అరెస్టు చేశాము. రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు 23,770 కిలోల గంజాయి, 27 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.. 293 వాహనాలను సీజ్ చేశారు. అలాగే గంజాయి సాగును ప్రోత్సహిస్తున్న ఏడుగురికి చెందిన దాదాపు రూ.7.75 కోట్ల విలువైన ఆస్తులను కూడా సీజ్ చేశాము' అని హోంమంత్రి అనిత వివరించారు.ఆపరేషన్ గరుడలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపుల్లో తనిఖీలు చేశారు. దీనిలో 150 షాపులను మూసివేశారు. ఒడిశా నుంచి వచ్చే రైళ్లలో కూడా తనిఖీలు నిర్వహించారు. ఈగల్ బృందాలు, రైల్వేశాఖ కలిసి తనిఖీలు చేశాయి. ఆరుగురిని అరెస్టు చేసి 37 కిలోల గంజాయి, 152 గంజాయి చాక్లెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతాలైన అరకు, పాడేరు ఒకప్పుడు గంజాయికి హబ్‌గా ఉండేవి. కానీ ఇప్పుడు అక్కడ మంచి కాఫీని పండిస్తున్నారు. ఈగల్ టాస్క్‌ఫోర్స్ ద్వారా ఏజెన్సీలో 325 హాట్ స్పాట్‌లను గుర్తించాము. గిరిజనుల జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయ పంటల సాగుకు సహాయం చేస్తున్నాము. ఎక్సైజ్ ఆదాయంలో 2% ఈగల్ విభాగానికి కేటాయించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది' అన్నారు.


ఏపీ హోంమంత్రి అనితకు ఊహించని అనుభవగంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం త్వరలో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు ఈగల్ ఐజీ రవికృష్ణ. 'విశాఖ ఏజెన్సీ ప్రాంతాలైన అరకు, పాడేరు గతంలో గంజాయి హబ్‌గా పేరు ఉంటే.. ఇప్పుడు అత్యుత్తమమైన కాఫీకి బ్రాండ్‌గా మారుతున్నాయి. త్వరలో ఆపరేషన్ గరుడ 2 మొదలవుతుంది. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వాడినా, అమ్మినా 1972కు సమాచారం ఇస్తే 24గంటలు ఈగల్ సిబ్బంది అందుబాటులో ఉండి చర్యలు తీసుకుంటారు' అని వివరించారు.

# కనిపించని చంద్రబాబు మార్క్..



విజయవాడ, తెలంగాణ దిశ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద పెద్ద భారం ఉంది. చంద్రబాబుపై పెట్టుకున్న నమ్మకానికి ఈ టర్మ్ అసలైన సమయమని విశ్లేషకులు సయితం అభిప్రాయపడుతున్నారు. 1995 నుంచి 2004 వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఆయన అభివృద్ధి పేరుతో ముఖ్యమంత్రి పదవిని నిలుపుకోగలిగారు. తనకు తానే ముఖ్యమంత్రిని కానని, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అని ప్రకటించుకున్నారు. ఇక ఆకస్మిక తనిఖీల పేరుతో అధికారులను హడలెత్తించారు. చంద్రబాబుకు గ్లామర్ లేదు. కానీ తన రాజకీయ చాణక్యంతో పలు మార్లు ఒంటిచేత్తో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తేగలిగారు. ఎన్టీఆర్ నుంచి పార్టీని తన చేతుల్లోకి తీసుకున్నా కార్యకర్తలను, నందమూరి కుటుంబ సభ్యలను ఒప్పించి మెప్పించగలిగారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత నూతన ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలను చేపట్టారు. ఆయనను ప్రజలు ఎంచుకున్నది కూడా ఆయన నాయకత్వం.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారన్న నమ్మకమే. అందుకే ప్రజలు గెలిపించారు. 2014 నుంచి 2019 వరకూ ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నప్పటికీ రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయారు. అందుకు తగిన సమయం లేదని ఆయన చెప్పిన కారణాన్ని జనం నమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే హైదరాబాద్ నుంచి రాజధానిని అమరావతికి తరలించడంతో పాటు పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేసినా అనేక కారణాలతో జాప్యం జరగడంతో ప్రజలు కూడా చంద్రబాబు చెప్పిన మాటలను విశ్వసించారు. ఇప్పుడు చంద్రబాబు మరోసారి అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయింది. అయితే చంద్రబాబు మార్క్ పాలన ఇప్పటి వరకూ ప్రారంభం కాలేదన్న అభిప్రాయం ప్రజల్లో కనపడుతుంది. సంక్షేమ కార్యక్రమాలను ఆలస్యంగా అమలు చేయడమే కాకుండా అభివృద్ధి పనులను కూడా వేగంగా చేయకపోవడంతో కొంత భిన్నమైన అభిప్రాయాలు ఏర్పడ్డాయి. కొత్తగా ప్రభుత్వం వచ్చిన తర్వాత పేరెన్నిక గన్న పరిశ్రమలు ఏపీకి రాలేదు. అలాగే అమరావతి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభమయినా అవి పూర్తవుతాయో లేదో తెలియడం లేదు. ఎందుకంటే సరైన వాతావరణ పరిస్థితులు కనిపించడం లేదు. దీనికి తోడు మళ్లీ అదనంగా ఇరవై వేల ఎకరాల భూమిని సేకరించాలని తీసుకున్న నిర్ణయాన్ని కూడా ఎవరూ హర్షించడం లేదు.. ఏడు పదులు దాటిన వయసులోనూ ఆయన ఇప్పటికీ కష్టపడుతున్నారు. కంపెనీలు రాక కోసం అనేక పర్యటనలు చేస్తున్నారు. ఢిల్లీకి వరసబెట్టి తిరుగుతున్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి సింగపూర్ పర్యటనకు కూడా వెళుతున్నారు. పరిశ్రమల స్థాపన కోసం ఆయన ఐదు రోజుల పాటు సింగపూర్ లోనే ఉ ంటారు. రేపు ఢిల్లీకి వెళుతున్నారు. రెండు రోజులు అక్కడే ఉండి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజక్టులు, నిధులు గురించి ప్రయత్నం చేయడానికే ఢిల్లీకి వెళుతున్నారు. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంగా పెట్టుకున్నారు. అమరావతి రాజధాని మొదటి దశ పనులు 2028 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. అయితే పక్కా ప్రణాళికతో వెళుతున్నప్పటికీ అనుకోని అవాంతరాలు ఈసారి కూడా ఆయన అనుకున్నది నెరవేరుతుందా? లేదా? అన్న అనుమానం అందరిలోనూ ఉంది. మరి చంద్రబాబు ఈ గండం నుంచి ఎలా బయటపడతారన్నది చూడాలి.

# క్రెడిట్‌కార్డులు తెగ వాడేస్తున్నారు..!




దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది తొలి ప్రథమార్థంలో దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన లావాదేవీలు 15శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ గణాంకాలు చెప్పాయి. ఇ-కామర్స్, ఫుడ్ డెలివరీతో పాటు ఇతర అవసరాల కోసం క్రెడిట్‌కార్డుల వినియోగం పెరిగినట్లు భావిస్తున్నారు. బ్యాంకులు సైతం ఈఎంఐ ఆఫర్లు, క్యాష్‌బ్యాక్, రివార్డ్ పాయింట్ల పేరుతో ఆఫర్లు సైతం ఇస్తున్నాయి. తాజాగా ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి.తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులు క్రెడిట్‌కార్డులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లు పేర్కొంది. థింక్

## తక్కువ వేతనాలు కారణమట..!

360 ఏఐ అధ్యయనం ప్రకారం.. నెలకు రూ.50వేల కంటే తక్కువ జీతం ఉన్న వారిలో 93శాతం మంది క్రెడిట్‌కార్డులపై ఆధారపడుతున్నట్లు చెప్పింది. అదే సమయంలో స్వయం ఉపాధి పొందుతున్న 85శాతం మంది సైతం క్రెడిట్‌కార్డులపై ఆధారపడుతున్నట్లుగా అధ్యయనం వెల్లడించింది. ఇప్పుడు పే తర్వాత (బీఎన్‌పీఎల్) సేవలను 18శాతం స్వయం ఉపాధి, వేతన జీవులు 15శాతం మంది ఉపయోగిస్తున్నట్లు డేటా పేర్కొంది. ఈ అధ్యయనం రూ.20వేల మంది ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులపై నిర్వహించింది. ఈ సందర్భంగా థింక్ 360 ఏఐ ఫౌండర్, సీఈవో అమిత్ దాస్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న భారతదేశ క్రెడెట్ ల్యాండ్ స్కేప్‌లో క్రెడిట్‌కార్డులు, బీఎన్‌పీఎల్ ఇప్పుడు వేతన జీవులతో పాటు ఉపాధి పొందుతున్న వారికి ప్రతీ ఒక్కరికీ అవసరంగా మారాయన్నారు. పెరుగుతున్న ఫిన్ టెక్ కంపెనీలు డిజిటల్ లోన్ రెవల్యూషన్‌ను తీసుకువచ్చాయన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీలు రూ.92వేల కోట్లకుపైగా వ్యక్తిగత రుణాలు ఇచ్చాయి. ఇది మొత్తం రుణాల సంఖ్యలో 76శాతం ఉ న్నట్లుగా సూచిస్తుందని పేర్కొన్నారు.

### దివ్యాంగుల సమస్యలు తెలుసుకునేందుకు

# అధికారులకు సైన్ లాంగ్వేజీలో శిక్షణ

**కరీంనగర్, తెలంగాణ దిశ :** దివ్యాంగుల సమస్యల్ని, భావాన్ని అర్థం చేసుకొని వారి స మస్యలను పరిష్కరించేందుకు సైన్ లాంగ్వేజి ఎంతగానో ఉపయోగపడు తుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రం పరిధిలోని కలెక్టరేట్ లో గల ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో అధికారులకు "బేసిక్ ఇండియన్ సైన్ లాంగ్వేజి" శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల్ని, వారి భావాన్ని సరిగ్గా అర్థం చేసుకునేందుకు సైన్ లాంగ్వేజి ఉపకరిస్తుందని అన్నారు. అందుకే జిల్లా జిల్లాలో మొదటగా జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏడు రోజులపాటు సాగే ఈ శిక్షణ రోజుకు రెండు విడతలుగా ఉ ంటుందని అన్నారు. అధికారులకు సైన్ లాంగ్వేజి శిక్షణ ఇస్తామని అన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పించిన అన్ని సౌకర్యాలు, ప్రయోజనాలను వారికి చెందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని అన్నారు. సైన్ లాంగ్వేజి నేర్చుకొని వారి విన్నపాలను సరిగ్గా అర్థం చేసుకోవచ్చుని, తద్వారా వారి సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు.

# నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద ప్రవాహం



**నల్లగొండ, తెలంగాణ దిశ :** ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణా నదిలో వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు కృష్ణమ్మ పరుగులు పెడుతుంది. శ్రీశైలం నుంచి సాగర్ వైపు వరద కొనసాగుతోంది. దీంతో నాగార్జున సాగర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుంది. దీంతో సాగర్ జలాశయం కళకళ లాడుతుంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 65,094 క్యూసెక్కులు ఉండగా, ఔట్ ఫ్లో 1650 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590.00 అడుగులు కాగా, ప్రస్తుత నీటి మట్టం 557.80 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 227.2912 టీఎంసీలుగా ఉంది.

# కౌలు రైతులపై వివక్ష

## హక్కుల కోసం రైతుల ఆందోళన



కౌలు రైతులు తమ హక్కుల కోసం దశాబ్దాల తరబడి పోరాడుతున్నారు. తమకు కనీసం సంస్థాగత పరపతి, ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని కోరుతున్నారు. ప్రభుత్వాల చిన్నచూపునకు బ్యాంకుల సహాయ నిరాకరణ తోడవడంతో వ్యవసాయ పెట్టుబడుల కోసం కౌలు రైతులు పడుతున్న అగచాట్లు పడుతున్నారని కౌలురైతుల సంఘం నాయకుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని చట్టాలు తీసుకుని వచ్చినా తమకు అండగా ఉండడం లేదన్నారు. రైతుల స్థితిగతులపై అధ్యయనం చేసిన జయతిఘోష్, కోనేరు రంగారావు కమిటీలు కౌల్దార్లకు బ్యాంక్ రుణాలిప్పించాలని

**ఏలూరు, తెలంగాణ దిశ :** వ్యవసాయం గిట్టుబాటుకాక, ప్రైవేటు అప్పులతో రుణగ్రస్తులై విధిలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న కౌల్దార్లను అసలు రైతులుగానే గుర్తించట్లేదు. పంటల ఉత్పత్తిలో, ఏపీలో 16 లక్షల మంది కౌలు రైతులుంటారని ప్రభుత్వమే లెక్కలేసింది. 20 లక్షలకు పైమాటేనని రైతుసంఘాలు చెబుతున్నాయి. కౌలు రైతులకు సంస్థాగత పరపతి కల్పించే విషయంలో ప్రభుత్వాల వైఫల్యం ఆనవాయితీగా వస్తుండగా అమలు కావడం లేదన్నారు. వ్యవసాయంలో మార్కెట్ శక్తుల ఆధిపత్యం పెరగడం, భూసంస్కరణలు జరగకపోవడం వలన ఏపీలో కౌలు రైతుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. అంచనా వేసిన మేరకైనా సర్కారు కౌలు రైతులను గుర్తించి బ్యాంకు రుణాలిప్పించిందా అంటే అదీ లేదు.

సిఫారసు చేసినా పెద్దగా ఫలితం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కౌల్దార్లకు రుణ అర్హత కార్డు జారీకి చట్టం తెచ్చింది. భూయజమానితో సంబంధం లేకుండా రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. నేటికీ గ్రామాల్లో భూస్వాములు, పెత్తందార్ల ఆధిపత్యం కొనసాగుతున్నందున కౌల్దార్లుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేదలకు కార్డులు రావట్లేదన్నారు. బ్యాంకులు కౌలు రైతుల రుణాలే ఎన్‌పిఏలుగా పేర్కొంటే ప్రభుత్వం కూడా దానిని అంగీకరించడం సరికాదని శ్రీనివాస్ అన్నారు. రుణమాఫీకి సవాలక్ష కొర్రీలు పెట్టింది. వడ్డీ మాఫీ, వడ్డీ రాయితీ పథకాల గురించి చెప్పనవసరం లేదు. ఎల్ఇసి లేని వారికి సాగు ధృవీకరణ పత్రాలన్నా పెద్దగా ఉపయోగం లేదు.

# అయోమయంలో సచివాలయ మహిళా పోలీసులు!



**అమరావతి, తెలంగాణ దిశ :** రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసుల పరిస్థితి అయోమయంగా మారింది. వీరు పోలీస్ శాఖ నియంత్రణలోకి వస్తారా లేక మహిళా శిశుసంక్షేమశాఖ నియంత్రణలోకి వస్తారా అనే విషయాన్ని ప్రభుత్వం ఇంతవరకు స్పష్టం చేయకపోవడమే దీనికి కారణం. మహిళా పోలీసుల రిక్రూట్ సమయంలో మహిళా శిశు సంక్షేమానికి సం బంధించిన బాధ్యతలు నిర్వహించా లని పేర్కొని, ఆచరణలో పోలీస్ విధులకు తమని కేటాయించే విధంగా ప్రభుత్వం వ్యవహరించనుందని వస్తున్న వార్తలు తమను ఆందోళనకు గురిచేస్తున్నాయని మ హిళా పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం సచివాలయ మహిళా పోలీసుల్లో 60శాతం మేరకు పోలీస్ విధులు నిర్వహించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు, మిగిలిన 40శాతం మంది మహిళా శిశుసంక్షేమ శాఖ పరిధిలో పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు చెబుతోంది. పోలీస్ ట్రైనింగ్ అకాడమీ ద్వారా రిక్రూట్ కాక పోవడంతో పోలీస్ డ్యూటీలు చేసేందుకు ఆసక్తి చూపుతున్న మహిళలకు త్వరలో షార్ట్ టమ్ పోలీస్ శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రక్రియకు ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. వీరికి రెగ్యులర్ పోలీస్ డ్యూటీలు కాకుండా కేవలం పోలీస్ స్టేషన్‌లోపల నిర్వహించే పోలీస్ విధులకు పరిమితం చేసే ఆలోచనలో పోలీస్ శాఖ ఉన్నట్లు సమాచారం. పోలీస్ స్టేషన్‌లో విధులంటే రిసెప్షన్, రైటర్‌కు సహాయకారిగా ఉండటం, సెంట్రీ డ్యూటీలు, మహిళా నేరస్తులకు ఎస్కార్ట్ డ్యూటీలు లాంటి వాటిల్లో వీరి సేవలను ఉపయోగించుకునే అవకాశం ఉండొచ్చని ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ఈ అంశంపై ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించేందుకు కసరత్తును ప్రారం భించే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. తమ ప్రమోషన్ ఛానెల్ ఎలా ఉంటుందో కూడా ప్రభుత్వం వెల్లడించాలని సచివాలయ మహిళా పోలీసులు కోరుతున్నారు.

# ఫారెస్ట్ కమిటీల ఏర్పాటు..

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** తెలంగాణలో అటవీ విస్తీర్ణం ఏటా తగ్గుతూవస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 27,688 చ.కి.మీ. అటవీ విస్తీర్ణమే ఉందని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇది రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 24.69 శాతం మాత్రమే. ఇటీవల విడుదలైన ఫారెస్ట్ సర్వే రిపోర్ట్‌లో 2021 2023 మధ్య దాదాపు 100.42 చ.కి.మీ. అటవీ భూమి తగ్గినట్టు వెల్లడైంది. దీంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం అటవీ విస్తీర్ణం పెంచాలని నిర్ణయించింది.ఓ వైపు వన మహోత్సవంలో భాగంగా చెట్ల పెంపకం చేపడుతూనే.. వాటి సంరక్షణకు కావాల్సిన చర్యల పై ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఒక కమిటీని కూడా నియమిందింది.దేశవ్యాప్తంగా అటవీభూములపరిరక్షణకోసం సుప్రీం కోర్టు ఇదివరకే పలు మార్గదర్శకాలను జారీ చేసింది.

అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు భూముల గుర్తింపు కోసం కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) డాక్టర్ సీ సువర్ణ చైరపర్సన్ గా ఆరుగురు సభ్యులతో తాజాగా కమిటీని ఏర్పాటు చేసింది.ఈ కమిటీలో వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పర్ట్స్, రిటైర్డ్ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శంకరన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ) చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రతినిధి, డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మాధవరావు, ఖమ్మం,రాజన్న జిల్లా అటవీశాఖ అధికారులను సభ్యులుగా నియమిం చింది. ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అటవీ, అటవియేతర ప్రభుత్వ భూములను గుర్తించనుంది. ఒకవేళ ప్రభుత్వ భూము ల్లో చెట్లు, పొదలు ఉంటే దాన్ని డీమ్డ్ ఫారెస్ట్‌గా పేర్కొనుంది.అటవీ భూములను గుర్తించి, వాటిని డాక్యుమెంట్ చేయనుంది. రెవెన్యూ, అటవీ శాఖల అధికారుల సమన్వయంతో జాయింట్ సర్వేలు చేపట్టనుంది. అటవీ భూముల అక్రమణలను గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోకున్నారు. అటవీ భూములను రియల్ ఎస్టేట్, మైనింగ్, ఇతర కార్యకలాపాల కోసం దుర్వినియోగం చేయకుండా, పోరంబోకు,

రెవెన్యూ, దేవాదాయం, ఇతర ప్రభుత్వ భూములకు రక్షణగా ఈ కమిటీ రిపోర్ట్ నిలుస్తుందని సంబందిత అధికారులు పేర్కొంటున్నారు. అటవీ ప్రాంతంగా పరిగణించిన భూములు, అటవీ లక్షణాలు కలిగిన ప్రాంతం, అటవీ బయట ఉన్న భూములను గుర్తించడానికి ప్రభు త్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించింది. ఇలాంటి భూమి ఎవరి ఆధీనంలో ఉన్నా.. వాటిని అటవీ భూముల జాబితాలో చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది.అధికారికం గా అడవులుగా వర్గీకరించని ప్రాంతాలతో పాటు అడవు లుగా అర్హత ఉన్న భూములను గుర్తించి డ్యాక్యుమెంట్ చేయనుం ది. చట్టబద్ధంగా అటవీ ప్రాంతంగా ప్రకటించకపోయినా, వర్గీకరించకపోయినా అటవీ ప్రాంత లక్షణా లుంటే కమిటీ ఫీల్డ్ సర్వే చేసి డీమ్డ్ ఫారెస్ట్‌గా గుర్తించనున్నది. ప్రభుత్వ భూమిలో దట్టమైన చెట్లు, పొదలు పెరిగితే వాటిని కూడా అడవుల జాబితాలో చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది.

# ఎవ్వరికి పట్టని ఆదిమూలం!



కొందరు రాజకీయ నేతలకు పాపం.. ఏ పార్టీలో ఉన్నా సుఖం ఉ ఒడదు. ఎమ్మెల్యేగా గెలిచారన్న మాటే కానీ వారు వార్డు సభ్యుడి కంటే హీనంగా చూస్తారు. అందులోనూ రిజర్వ్ డ్ నియోజకవర్గాల్లో ఇటువంటి పరిస్థితి ఉంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా రిజర్వ్ డ్ నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోవాల్సిందే. అది వైసీపీ అధికారంలో ఉంటే రెడ్డి సామాజికవర్గం నేతలు ఆధిపత్యం వహిస్తారు. టీడీపీ అధికారంలో ఉంటే కమ్మ సామాజికవర్గం నేతలు పెత్తనం చేస్తారు. ఫలితం మాత్రం సేమ్ టు సేమ్. అక్కడ ఎమ్మెల్యేల మాట చెల్లుబాటు కాదు. పార్టీని నడిపించే అధికార పార్టీ నేతల మాటకే విలువ ఉంటుంది. అధికారులు సయితం వారికే సెల్యూట్ కొడతారు.రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా... చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏ మాత్రం లేదు. సత్యవేడు నియోజకవర్గం నుంచి కోనేటి ఆదిమూలం 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచారు. అయితే అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ఆయన మాట చెల్లుబాటు కాలేదు. అంతా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనమే నడిచింది. తన నియోజకవర్గం కాకపోయినా చిత్తూరు జిల్లా కావడంతో పెద్దిరెడ్డి చెప్పినట్లు అధికారులు నడుచుకునే వారు. ఆదిమూలం మాత్రం పేరుకు ఎమ్మెల్యేగా ఉన్నా ఏ ప్రయోజనమూ లేదు. పెద్దిరెడ్డితో కోనేటి ఆదిమూలం విభేదించడంతో ఆయనను తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం ఎంపీగా పోటీ చేయాలని అన్నారు. దీనికి ఇష్టపడని ఆదిమూలం టీడీపీలో చేరిపోయారు.. టీడీపీ నుంచి 2024 ఎన్నికల్లో టిక్కెట్ తెచ్చుకున్న కోనేటి ఆదిమూలం రెండోసారి కూడా గెలిచారు. అయినా పరిస్థితుల్లో ఏమాత్రం మార్పురాలేదు. ఆయనపై లైంగిక వేధింపుల కేసు నమోదయింది. దీంతో తెలుగుదేశం పార్టీ ఆదిమూలం కోనేటిని సస్పెండ్ చేసింది. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై కేసు నమోదయింది. తనపై కుట్ర జరిగిందని ఆయన చెప్పినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేశారు. తర్వాత న్యాయస్థానంలో బాధితురాలు ఆ కేసును విత్ డ్రా చేసుకోవడంతో ఆదిమూలం కోనేటి పై కేసును కొట్టి వేశారు. కేసు ఏమీ లేదని తెలిసిన తర్వాత, బాధితురాలు స్వయంగా ప్రకటన చేసిన తర్వాత కూడా కోనేటి ఆదిమూలం పరిస్థితుల్లో మార్పు రాలేదు. దీంతో కోనేటి ఆదిమూలంకు కోపం నషాళానికి అంటింది. ఎంతమంది తనపై పెత్తనం చలాయిస్తారంటూ మండిపడ్డారు. కొద్ది రోజులుగా తనా? పార్టీకి దూరంగా ఉంటే నియోజకవర్గంలో ఎవరు పడితే వాళ్లు వస్తారా? అని ఆయన నిన్న ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యేకు కాకుండా పార్టీలో ఉన్న ఇతరులకు పోలీసులు ఎలా సెల్యూట్ కొడతారంటూ ఆదిమూలం కోనేటి మండిపడ్డారు. ప్రజల ఓట్లతో గెలిచిన తనను కాదని, ఒకరు కో- ఆర్డినేటర్ గా, మరకొరు పరిశీలకుడిగా చెప్పుకుంటూ నియోజకవర్గంలో పనులన్నీ చక్కబెట్టుకుంటున్నారని, తనపై తప్పుడు ప్రచారం చేసిన వారినే వీరు వెనకేసుకు వస్తున్నారని ఆదిమూలం కోనేటి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆదిమూలం ఆవేదన పట్టించుకునే వారెవరు?

# సీనియర్లకు మళ్లీ ఆశలు



**కాకినాడ, తెలంగాణ దిశ :** టీడీపీ అతిపెద్ద రీజనల్ పార్టీ. పైగా బల హీనవర్గాలకు పెద్దపీట అనే నినాదంతో వచ్చిన ఆ పార్టీ..ఎందరో సామాన్యులను నాయకులుగా తయారు చేసింది. అలా నాలుగున్నర దశాబ్దాల టీడీపీ పార్టీలో..సీనియర్ మోస్ట్ లీడర్లు చాలా మందే ఉన్నారు. ఐదారుసార్లు మంత్రులుగా పనిచేసిన వారు..ఆరేడు సార్లు గెలిచిన వాళ్లు..సామాజిక వర్గాల వారీగా, ప్రాంతాల వారీగా సైకిల్ పార్టీకి బలమైన అనుభవమున్న నేతలు ఉన్నారు.అయితే గత ఎన్నికలకు ముందు పార్టీలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని.. రాబోయే 40ఏళ్లు పార్టీ స్ట్రాంగ్‌గా నిలబడేలా నాయకత్వాన్ని పటిష్టం చేసుకో వాలనే ఆలోచనతో..చాలామంది జూనియర్లకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు సీఎం చంద్రబాబు. ఫస్ట్ టైమ్ గెలిచిన ఎమ్మెల్యేలను కూడా మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఇప్పుడున్న క్యాబినెట్‌లో 18మంది కొత్త ముఖాలే. అయితే ఈ మధ్య మంత్రుల పనితీరుపై చాలా సీరియస్‌గా ఉన్నారు చంద్రబాబు.పనితీరు బాలేదని ముఖం మీదే చెప్పయడమే కాదు..మంత్రివర్గంలో మార్పులు, చేర్పులకు రెడీ అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే శ్రావణమాసం రాగానే..క్యాబినెట్‌లో ఇప్పటికే ఖాళీగా ఉన్న ఓ పోస్ట్‌ను భర్తీ చేయ డంతో పాటు..నలుగురు, ఐదుగుర్ని తొలగించి వారి స్థానంలో కొత్తవాళ్లను తీసుకుంటారన్న ప్రచారం బయలుదేరింది.పనితీరు బాలేని జూనియర్లను క్యాబినెట్ నుంచి తప్పిస్తారన్న ఊహాగానాల తో..సీనియర్లలో ఆశలు చిగురిస్తున్నాయట. ఉత్తరాంధ్ర టు రాయలసీమ వరకు టీడీపీలో చాలా మంది సీనియర్లు మంత్రి పదవి మీద ఆశలు పెట్టుకున్నారట. అయితే 2024లో బెర్త్ దొరకక కాస్త మౌనంగానే ఉంటూ వస్తున్నారు. జిల్లాలను శాసించే సీనియర్ లీడర్లు కాస్త..సొంత నియోజకవర్గాలకే పరిమితం అవుతూ వస్తున్నా రు. అంతేకాదు వైసీపీపై విమర్శల విషయంలో కూడా మంత్రులదే బాధ్యత అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారట. అయితే సీనియర్ల లీడర్లతో అధినాయకత్వం బాగానే ఉంటోంది. మంత్రివర్గంలోకి తీసుకోకపోయి నా.. పెద్ద పెద్ద పోస్టులు ఇవ్వకపోయినా..పార్టీ కోసమే కొత్త నీరు అన్నట్లుగానే చెబుతూ వస్తోంది. ప్రభుత్వంలో పెద్దగా అనుభవం కలిగినవారు లేకపోవడంతో ధాటిగా విపక్షాల విమర్శలను తిప్పికొట్టలే కపోతున్నారట. ఇప్పుడున్న మంత్రివర్గంలో ఇద్దరు సీనియర్ లీడర్లు రామానాయుడు, పయ్యావుల కేశవ్ పనితీరు మీద మాత్రమే సీఎం సంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈసారి విస్తరణలో మళ్లీ సీనియర్లనే తీసుకుంటారని..తమకు అవకాశం దక్కబోతుందని హోప్స్ పెట్టుకుంటున్నారట సీనియర్ టీడీపీ లీడర్లుసబ్జెక్ట్‌పై పట్టుండేవారు. విపక్షం నుంచి ఒక విమర్శ రాగానే అన్ని లెక్కలతో సహా ఇచ్చిపడేసే వాళ్లు. రాజకీయంగా దూకుడుగా ఉండేవారు అవసరమని భావిస్తున్నా రట. ఇవన్నీ క్వాలిటీస్ ఉండాలంటే సీనియర్లుగా తమకే అవకాశం ఉంటుందనేది నేతల అంచనాలున్నాయట. ఈ క్రమంలోనే మంత్రివ ర్గంలో మార్పులు జరిగితే కనుక కచ్చితంగా సీనియర్లకు ధాటిగా మాట్లాడేవారికి కచ్చితంగా చోటు దక్కుతుందని ప్రచారం సాగుతోంది. దాంతో సీనియర్ లీడర్లలో ఫుల్ హుషార్ కనిపిస్తోందట.తమకు అమాత్య కిరీటలు దక్కే రోజు దగ్గరలోనే ఉందని ఊహల్లో తేలియాడు తు న్నారట. మళ్లీ అధికారం చేపట్టాలంటే ప్రయోగాలను పక్కన పెట్టి..వైసీపీని కట్టడి చేసేందుకు సీనియర్లను రంగంలోకి దింపే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

# అన్నమయ్య జిల్లా మహిళల అద్భుతాలు!

**కడప, తెలంగాణ దిశ :** అన్నమయ్య జిల్లా మహిళలు రసాయన ఎరువులకు దూరంగా ప్రకృతి వ్యవసాయంతో ఆదర్శంగా నిలుస్తున్నారు. పొదుపు సంఘాలతో కలిసి చిరుధాన్యాల తినుబండారాలు తయారు చేసి విక్రయిస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ, రాగి లడ్డూలు, కొర్ర పాయసం వంటి వాటిని మండల కేంద్రాల్లో అమ్ముతున్నారు. వారానికి రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం పొందుతూ, కుటుంబానికి లక్ష నుంచి రెండు లక్షల వరకు సంపాదిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రసాయన ఎరువుల కారణంగా పంటలు విషపూరితం అవుతున్నాయి. ఈ క్రమంలో ప్రకృతి వ్యవసాయం వైపు ఎంతోమంది రైతులు మొగ్గు చూపుతున్నారు. అన్నదాతలు మాత్రమే కాదు.. అన్నమయ్య జిల్లాలోని మహిళలు పొదుపు సంఘాలతో పాటు ప్రకృతి వ్యవసాయం కూడా చేస్తున్నారు. చిరుధాన్యాలతో తినుబండారాలు తయారు చేసి అమ్ముతున్నారు.. తద్వారా లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ప్రకృతి వ్యవసా యంలో రాణిస్తున్నారు.. లాభాలు కూడా పొందుతున్నారు. అన్నమయ్య జిల్లా అయ్యవారిపల్లె, చింతలవారిపల్లె, చింతపర్తి, నగిరి మడుగ, బూడిద వేడుకు చెందిన 15 మంది మహిళలు కలిసి ఒక సంఘంగా ఏర్పడ్డారు. వారికి అందుబాటులో ఉన్న తక్కువ విస్తీర్ణంలోనే ఏకంగా ఏడు రకాల కూరగాయలు, ఆకుకూరలు నేచరల్‌గా పండిస్తున్నారు. అంతేకాదు చిరుధాన్యాలతో తినుబండారాలు తయారు చేస్తున్నారు.. వీటిలో రాగి లడ్డూలు, కొర్ర పాయసం, సద్ద మురుకులు వంటివి ఉన్నయాయి. ఇలా పండించిన కూరగాయలు, ఆకుకూరలు.. తయారు చేసిన తినుబండారాలను తీసుకెళ్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల దగ్గర విక్రయిస్తున్నారు.. ప్రతి సోమవారం అమ్మకాలు జరుగుతున్నాయి.ఇలా ప్రతి సోమవారం ఒక్క రోజులోనే దాదాపు 4 నుంచి 5 క్వింటాళ్ల కూరగాయలు అమ్ముతు సక్సెస్ అయ్యారు. ఇలా వీరు రూ. 14వేల నుంచి రూ. 20వేల వరకు ఆదాయం సంపాదిస్తున్నారు. ఏడాది పొడవునా దిగుబడి వస్తూనే ఉంటుందని మహిళా రైతులు చెబుతున్నారు. ఇలా తమ సంఘంలో ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు ఆదాయం వస్తుంది అంటున్నారు. వీరు స్టాల్స్ ద్వారా వారానికి ఒకరోజు అమ్మకాలు చేయడంతో మంచి ఆదాయం వస్తోంది. తాము కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నామని.. ఈ విధానం అటు మహిళలతో పాటుగా ఇటు ప్రజలకు మంచిదన్నారు.తాము స్వయం గా ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకుంటున్నామని చెబుతున్నారు మహిళలు. ఇటీవల కాలంలో ప్రజలు ప్రకృతి ఉత్పత్తులను కొనడానికి ఆసక్తి పెరిగిందని.. తాము ఏడాదికి లక్ష రూపాయలకు తగ్గకుండా ఆదాయం పొందుతున్నామంటున్నారు. అది కూడా తాము ప్రకృతి విధానంలో వ్యవసాయం చేసన్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నాము అంటున్నారు. నాణ్యమైన ఆహార ఉత్పత్తులను తయారు చేసి స్వయం గా అమ్ముకుంటున్నామని.. తమకు ఆర్థికంగా ఉపయోగంగా ఉంటుందంటున్నారు. ఇలా సంపాదించిన డబ్బులతో తమ పిల్లలను చదివిస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నామంటున్నారు. తామంతా కలిసి వ్యవసాయం చేస్తున్నామని.. అలాగే తినుబండారాలు తయారు చేసి అమ్ముతున్నామంటున్నారు మహిళలు. ఇలా మంచి ఆదాయం వస్తోం దని.. తాము రాబోయే రోజుల్లో మరింత విస్తీర్ణంలో పంటలు పండిం చాలని భావిస్తున్నట్లు తెలిపారు. తాము కూడా భవిష్యత్‌లో పెద్ద ఎత్తున అమ్మకాలు జరపాలని ఆలోచన ఉందన్నారు. ఈ ఆలోచన ఒక్క అన్నమయ్య జిల్లాకు మాత్రమే కాదు రాష్ట్రవ్యాప్తంగా మహిళలు కూడా ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

# నైపుణ్య శిక్షణ కోసం ఎంబీసి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

## - జిల్లా బీసి అభివృద్ధి అధికారి రంగారెడ్డి

**పెద్దపల్లి, తెలంగాణ దిశ :** నైపుణ్య శిక్షణ కోసం ఆసక్తి , అర్హత గల ఎంబీసి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసి అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి తెలి పారు. వె నుకబడిన తరగతుల అభి వృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతీ యువకు లకు వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమం ద్వారా 4 రోజుల పాటు హైదరాబాద్ లో అందిం చడం జరుగుతుందని అన్నా రు. టిఏ, వసతి కల్పించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులకు 21 నుంచి 30 సంవత్సరాల వయసు లోపు ఉండాలని , ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలని , ఎంబిసి 36 కులాల వారికి మాత్రమే ఈ శిక్షణ కార్యక్రమం అందుతుం దని, వీరి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షలు ఉండాలని అన్నారు. ఆసక్తి అర్హత కల అభ్యర్థులు తమ దరఖాస్తులను tgobmms.cgg. gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకొని, ఆధార్ కార్డు కుల, పత్రం ఆదాయ ధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లతో దరఖా స్తు జత చేసి పెద్దపల్లి కలెక్టరేట్ లో ఉన్న బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ నెల సమర్పించాలని , నిరుద్యోగ ఎంబీసీ యువతీ యువకులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి పేర్కొన్నారు.



రోజూ గుప్పెడు నలుపు రంగు కిస్మిస్‌లను **ఎందుకంటే..?**

# నీటిలో నానబెట్టి తినాలి..

కిస్మిస్‌లు.. వీటినే ఎండు ద్రాక్ష అని కూడా అంటారు. ద్రాక్షలను ఎండబెట్టి వీటిని తయారు చేస్తారు. కిస్మిస్‌లను ఎక్కువగా తీపి వంటకాల్లో వేస్తుంటారు. అయితే కిస్మిస్‌లలో అనేక రకాలు ఉంటాయి. వాటిల్లో నలుపు రంగు కిస్మిస్‌లు కూడా ఒకటి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. నలుపు రంగు కిస్మిస్‌లలో పోషకాలు అధికంగా ఉంటాయి. వీటిని తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు పొందవచ్చు. ఈ కిస్మిస్‌లను 100 గ్రాముల మోతాదులో తింటే సుమారుగా 300 క్యాలరీల శక్తి లభిస్తుంది. పిండి పదార్థాలు 80 గ్రాములు, ఫైబర్ 7 గ్రాములు, ప్రోటీన్లు 3 గ్రాములు లభిస్తాయి. కొవ్వులు అసలే ఉండవు. విటమిన్లు బి1, బి2, బి3, బి6, బి9లతోపాటు విటమిన్ సి అధికంగా లభిస్తుంది. అలాగే ఈ కిస్మిస్‌లలో ఐరన్, పొటాషియం, క్యాల్షియం, మెగ్నిషియం, మాంగనీస్, కాపర్, బోరాన్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ కిస్మిస్‌లను తింటే పోషకాలు లభిస్తాయి. పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చు.

**రక్తహీనత సమస్యకు..:** నలుపు రంగు కిస్మిస్‌లలో ఐరన్ అధికంగా ఉంటుంది. అందువల్ల ఈ కిస్మిస్‌లను తింటే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. హిమోగ్లోబిన్ తయారవుతుంది. ఈ కిస్మిస్‌లలో ఉండే విటమిన్ సి వల్ల శరీరం ఐరన్‌ను మరింత మెరుగ్గా శోషించుకుంటుంది. అలాగే కాపర్ కూడా లభిస్తుంది. దీంతో ఎర్ర రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. రక్తం తయారవుతుంది. రక్తహీనత సమస్య నుంచి బయట పడవచ్చు. నీరసం, అలసట తగ్గుతాయి. నలుపు రంగు కిస్మిస్‌లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా సార్బిటాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. అందువల్ల ఈ కిస్మిస్‌లను తింటే పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. మలబద్ధకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీని వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది.

**ఎముకల ఆరోగ్యానికి..:** నలుపు రంగు కిస్మిస్‌లలో క్యాల్షియం, బోరాన్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల సాంద్రతను పెంచుతాయి. ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మనం తిన్న ఆహారంలో ఉండే క్యాల్షియంను శరీరం మరింత మెరుగ్గా శోషించుకుంటుంది. దీంతో ఎముకలు బలంగా తయారవుతాయి. వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియో పోరోసిస్ సమస్య రాకుండా అడ్డుకోవచ్చు. మెనోపాజ్ దాటిన మహిళల్లో ఎముకలు బలహీనంగా మారకుండా ఉంటాయి. నలుపు రంగు కిస్మిస్‌లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో సోడియం స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. అలాగే ఈ కిస్మిస్‌లలో ఉండే రెస్వెరెట్రాల్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గేలా చేస్తాయి. దీంతో రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. గుండె పోటు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**రోగ నిరోధక వ్యవస్థకు..:** నలుపు రంగు కిస్మిస్‌లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి కనుక వీటిని తింటే ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. ఈ కిస్మిస్‌లలో ఉండే పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్, ఆంథో సయనిన్స్ ఆక్సీకరణ ఒత్తిడిని, శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులను తగ్గిస్తాయి. దీంతో తీవ్రమైన, ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూసుకోవచ్చు. ఈ కిస్మిస్‌లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి శరీర రోగ నిరోధక వ్యవస్థను బలంగా మారుస్తాయి. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు తగ్గుతాయి. ఇలా నలుపు రంగు కిస్మిస్‌లను రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. కనుక వీటిని రోజూ నీటిలో నానబెట్టి తింటే మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

## నలుపును పోగొట్టాలంటే..



అందాన్ని కాపాడుకోవడానికి.. ముఖంపైనే ఎక్కువ శ్రద్ధ పెడుతుంటారు. ఇతర శరీర భాగాలపై నిర్లక్ష్యం చూపుతుంటారు. ముఖ్యంగా, చర్మం మందంగా ఉండే మోచేతులు, మోకాళ్లను మరీ అశ్రద్ధ చేస్తుంటారు. దాంతో ఆయా భాగాలు నల్లగా మారిపోయి.. అందవిహీనంగా కనిపిస్తుంటారు. కాస్త శ్రద్ధ పెడితే.. మోచేతులు, మోకాళ్ల దగ్గర చర్మం నల్లదనాన్ని పోగొట్టుకోవచ్చని బ్యూటీషియన్లు చెబుతున్నారు. నిమ్మకాయ సహజసిద్ధమైన బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి.. చర్మంలోని మృత కణాలను సమర్థంగా తొలగిస్తుంది. చర్మం రంగునూ మెరుగుపరుస్తుంది. నిమ్మకాయ ముక్కలతో మోచేతులు, మోకాళ్లపై రుద్దితే.. మంచి ఫలితం కనిపిస్తుంది. చర్మం రంగును మెరిపించడంలో పెరుగు ముందుంటుంది. ఇందులో లభించే లాక్టిక్ యాసిడ్.. చర్మాన్ని తేమగా ఉంచుతుంది. మోచేతులు, మోకాళ్లపై పెరుగును అప్లయి చేయాలి. 15-20 నిమిషాలపాటు అలాగే వదిలేసి.. గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. కొబ్బరి నూనెలో విటమిన్-ఇ పుష్కలంగా లభిస్తుంది. చర్మాన్ని తేమగా ఉంచడంలో, నలుపును వదిలించడంలో ఇది ముందుంటుంది. వారానికి రెండుమూడు సార్లయినా.. మోచేతులు, మోకాళ్లపై కొబ్బరి నూనెతో సున్నితంగా మర్దనా చేసుకోవాలి. రెగ్యులర్‌గా చేస్తే.. ఆయా భాగాల్లోని నలుపు తొలగిపోతుంది. బంగాళాదుంప ముక్కతో మోచేతులు, మోకాళ్లపై 5 నిమిషాల పాటు బాగా రుద్దుకోవాలి. ఆ తర్వాత నీటితో కడిగితే.. మంచి ఫలితం కనిపిస్తుంది.

## దానిమ్మ పండ్లను తిన్న తరువాత తొక్కను పడేయకండి..

### వాటితో కలిగే లాభాలు తెలిస్తే షాకవుతారు..!




దానిమ్మ పండ్లు చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా ఎరుపు రంగులో దర్శనమిస్తుంటాయి. ఈ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ లభిస్తాయి. దానిమ్మ పండ్లను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. కొందరు జ్యూస్ తాగేందుకు ఇష్టం చూపిస్తారు. దానిమ్మ పండ్లను తినడం వల్ల మనకు అద్భుతమైన లాభాలు కలుగుతాయి. పలు వ్యాధులను నయం చేసే శక్తి దానిమ్మ పండ్లకు ఉంటుంది. అయితే దానిమ్మ పండ్లు మాత్రమే కాదు, దాని తొక్క కూడా మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీన్ని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. లేదా తొక్కను ఎండబెట్టి పొడి చేసి దాన్ని కూడా ఉపయోగించుకోవచ్చు. ఇలా దానిమ్మ తొక్కను వాడితే ఎన్నో లాభాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దానిమ్మ తొక్కలతో పలు చిట్కాలను పాటించడం వల్ల వ్యాధులను నయం చేసుకోవచ్చని అంటున్నారు.

**వాపులు, నొప్పులకు..:** దానిమ్మ తొక్కలో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. దానిమ్మ గింజల కన్నా అధిక మొత్తంలో యాంటీ ఆక్సిడెంట్లు దాని తొక్కలోనే ఉంటాయి. ముఖ్యంగా ఈ తొక్కలో పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించడంలో సహాయం చేస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా శరీరంలో అంతర్గత వాపులు తగ్గిపోతాయి. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. నాడీ సంబంధ వ్యవస్థ సైతం ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ పండు తొక్కలోబయోయాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. శరీరంలో ఉండే వాపులను తగ్గిస్తాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. శరీరంలోని నొప్పులు తగ్గిపోతాయి. కండరాల నొప్పులనుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి..:** దానిమ్మ పండు తొక్కలో యాస్ట్రింజెంట్ గుణాలు ఉంటాయి. ఈ తొక్కలో టానిన్స్ కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి పేగులు, జీర్ణాశయం గోడల మ్యూకస్ పొరను రక్షిస్తాయి. దీంతో విరేచనాల నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్ట, పేగుల్లో ఉండే సూక్ష్మ క్రిములు నశిస్తాయి. మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణశక్తిని మెరుగు పరుస్తుంది. దానిమ్మ పండు తొక్కలో ఉండే పాలిఫినాల్స్ మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**షుగర్ సమస్యకు..:** షుగర్ వ్యాధి ఉన్నవారు దానిమ్మ పండు తొక్కలను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు 2 సార్లు ఒక కప్పు మోతాదులో తాగుతుంటే షుగర్ లెవల్స్ నియంత్రణలోకి వస్తాయి. ఈ తొక్కలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ ను తగ్గించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. టైప్ 2డయాబెటిస్ ఉన్నవారు ఈ నీళ్లను సేవిస్తుంటే శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ తగ్గుతుంది. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. దానిమ్మ పండు తొక్కలోయాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల దీన్ని తీసుకుంటే ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. ఇన్‌ఫెక్షన్లు, జ్వరం, దగ్గు, జలుబు వంటి బారిన పడిన వారు దానిమ్మ పండు తొక్క నీళ్లను తాగుతుంటే త్వరగా కోలుకుంటారు. ఇలా దానిమ్మ పండు తొక్క వల్ల ఎన్నో అద్భుతమైన లాభాలను పొందవచ్చు.

## బ్రేక్‌ఫాస్ట్‌ను బ్రేక్ చేస్తున్నారా?




ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మిస్ చేస్తున్నారా? అయితే, మీ మానసిక ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉన్నదట. 'అల్పాహారం-మానసిక ఆరోగ్యం'పై చేసిన ఓ సర్వే.. ఈ విషయాలను వెల్లడిస్తున్నది. 'హాంకాంగ్ యూత్ ఎపిడెమియోలాజికల్ స్టడీ ఆఫ్ మెంటల్ హెల్త్' పరిశోధకులు ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందుకోసం 15 నుంచి 24 ఏళ్ల వయసుగల 3,154 మందిని ఎంపిక చేశారు. వీరి రోజూవారి ఆహార అలవాట్లను పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం ఏదో ఒకటి తిన్నవారితో పోలిస్తే.. అల్పాహారం దాటవేసినవారు ఎక్కువ ఉద్రేకంతో, ఆందోళనతో, నిరాశతో కనిపించినట్లు పరిశోధకులు గుర్తించారు. అధ్యయనంలో పాల్గొన్న వారిలో 85% మంది ప్రతిరోజూ లేదా అడపాదడపా ఏదో ఒక అల్పాహారం తీసుకున్నారు. మిగిలిన 15% మంది బ్రేక్‌ఫాస్ట్‌ను పూర్తిగా దాటవేశారు. ఈ సందర్భంగా అల్పాహారం తీసుకోని వారిలో శ్రద్ధ తగ్గిపోవడం, స్వీయ నియంత్రణను కోల్పోవడం లాంటి సమస్యలను గుర్తించినట్లు అధ్యయనకారులు చెబుతున్నారు.

ఇక అల్పాహారం దాటవేసేవారు తక్కువ ఉత్పాదకత కలిగి ఉన్నారని, పేలవమైన పనితీరును కనబర్చినట్లు గుర్తించారు. ఉద్యోగాలలోనూ తక్కువ సామర్థ్యం కలిగి ఉన్నారని నివేదించారు. బ్రేక్‌ఫాస్ట్‌ను దాటవేయడం వల్ల మధ్యాహ్నం వరకే నిస్సత్తువ ఆవహిస్తుందనీ, దాంతో దేనిమీదా శ్రద్ధ పుట్టదని చెబుతున్నారు.

అందుకే, ఏ రకమైన ఆహారం, ఎంత పరిమాణంలో తింటారనే విషయాలతో సంబంధం లేకుండా.. ఉదయంపూట ఏదో ఒకటి తినడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక అల్పాహారం వల్ల మానసిక ఆరోగ్య ప్రయోజనాలతోపాటు శారీరక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత.. మధ్యాహ్నంపూట తక్కువ కేలరీలు తీసుకుంటారు. దాంతో బరువు అదుపులో ఉంటుంది. రక్తంలోనూ చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి.


## కొవిడ్ టీకాలతో నాడీ సమస్యలు

### నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్



బెంగళూరు: కొవిడ్-19 ఇన్ఫెక్షన్, కొవిడ్ టీకాలకు నాడీ సంబంధ సమస్యలకు సంబంధం ఉన్నట్లు తెలిసింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ నిర్వహించిన క్లినికల్ స్టడీస్‌లో ఈ విషయం వెల్లడైంది. 2020 మార్చి-సెప్టెంబరు మధ్య కాలంలో న్యూరలాజికల్ అస్వస్థతలతో బాధపడుతున్న 3,200 మంది రోగుల హాస్పిటల్ రికార్డులను నిమ్‌హాన్స్ సమీక్షించింది. వీరిలో 120 మంది రోగులకు కొవిడ్ ఇన్ఫెక్షన్‌తోపాటు న్యూరలా జికల్ అస్వస్థతలు కూడా ఉన్నట్లు తెలిసింది. కాబట్టి రోగులు కోలుకున్న తర్వాత కూడా సుదీర్ఘ కాలంపాటు వారిని పర్యవేక్షించవ లసిన అవసరం ఉన్నట్లు స్పష్టమవుతున్నదని తెలిపారు.

# వాదన కావొద్దు వివాదం



ఆలుమగల మధ్య అలకలు అందమే! వాదోపవాదాలూ.. గిల్లికజ్జాలూ సర్వ సాధారణమే! ఇలా.. గొడవలకు దారితీయని అభిప్రాయబేధాలు మంచివేనట. అవి.. భార్యభర్తల నడుమ బంధాన్ని మరింత బలపరుస్తాయట. అయితే.. ఆ మనస్ఫర్ధలను టీ కప్పులో తుఫానులా తేలిపోనివ్వాలి. నివురు గప్పిన నిప్పులా దాచేస్తే.. అసలుకే మోసం వస్తుంది. ఎంత అన్యోన్యంగా జీవిస్తున్నా.. దంపతులన్నాక ఏదో ఒక విషయంలో మాట పట్టింపులు వస్తుంటాయి. వాదోపవాదాలు, చిన్నచిన్న గొడవలు పడుతుంటారు. అయితే, కొందరు ఇలాంటి గొడవలను మొగ్గలోనే తుంచేసి అనుబంధాలను బలపర్చుకుంటారు. కొందరు మాత్రం.. పెద్దవిగా చేసి బంధాన్ని తెంచేసుకుంటారు. 'ది హెల్దీ మ్యారేజ్' డేటా ప్రకారం.. సగటున ప్రతి జంటా నెలకు రెండుమూడు సార్లు గొడవలు పడుతుంటాయట. వీటిలో చాలావరకు.. ముదరకుండా చూసుకుంటూ, అన్యోన్యంగా ఉంటున్నారు. అందుకే, భార్యభర్తల నడుమ తలెత్తే వివాదాలు పరిమితిలోనే ఉండాలని మానసిక నిపుణులు చెబుతున్నారు. అప్పుడే.. అపార్థాలన్నీ తొలగిపోతాయని అంటున్నారు. వాదనకూ, గొడవకూ మధ్య తేడాలను గుర్తించాలి. వాదనలో.. ఏదో ఒక నిర్దిష్ట సమస్యపైనే దృష్టిని కేంద్రీకరిస్తారు. దానిపైనే వాడీవేడీగా చర్చించుకుంటారు. ఒకరు చెప్పేది మరొకరు వింటారు. రాజీపడటం, క్షమాపణలు, వాదనలకు పరిష్కార ప్రయత్నాలూ కనిపిస్తాయి. అదే.. గొడవ పడేవారిలో ఒకరిపై ఒకరికి ప్రతికూల భావనలు ఏర్పడతాయి. అది ఇద్దరి మధ్యా దూరం పెంచుతుంది. మనసు విరిగిపోయేలా చేస్తుంది. చిన్నచిన్న అభిప్రాయభేదాల వల్ల భాగస్వామి ఇష్టాయిష్టాలు తెలుస్తాయి. అందుకు తగ్గట్టుగా నడుచుకునేందుకు అవకాశం దొరుకుతుంది. అంతేకాకుండా.. వాదనలతోనే ముగిస్తే, రాబోయే రోజుల్లో పెద్ద గొడవలు జరగకుండా ఉంటాయి. ఆరోగ్యకరమైన వాదనలు బంధాన్ని, సాన్నిహిత్యాన్ని మరింతగా పెంచుతాయి.

చిన్న మాటే.. పెద్దపెద్ద గొడవలకు నాంది పలుకుతుంది. కాబట్టి, భాగస్వామితో వాదించేటప్పుడు భాషను అదుపులో పెట్టుకోవాలి. లేకుంటే.. వాదన వివాదానికి దారితీస్తుంది. పరిస్థితి సంక్లిష్టంగా మారుతుందని గుర్తించుకోండి.

కొందరు పాత విషయాలను మనసులోనే పెట్టుకుంటారు. సందర్భం దొరికితే చాలు పాత సంగతులు తోడుతారు. వాటినే తమ అస్త్రాలుగా మలుచుకొని.. భాగస్వామిపై ఎదురుదాడికి దిగుతారు. దాంతో గొడవలు తీవ్రరూపం దాలుస్తాయి. కాబట్టి, మీ తాజా వాదన దేనిగురించో.. దానిపైనే నిలబడండి.

# సినిమా..



## బాక్సాఫీస్ దగ్గర ప్రభంజనం సృష్టిస్తున్న

# మహావతార్ నరసింహ

ఎలాంటి హైప్ లేకుండా, పెద్దగా ప్రమోషన్‌లు చేయకుండా సైలెంట్‌గా విడుదలైన "మహావతార్ నరసింహ" సినిమా ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలెట్టింది.మొదటి రోజునే విజువల్ గ్రాండియర్, హై క్వాలిటీ యానిమేషన్, కిక్ ఇచ్చే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సన్నివేశాలు, క్రౌడ్‌ను ఎమోషనల్‌గా టచ్ చేసిన పౌరాణిక కథనంతో ఈ చిత్రం భారీగా వసూళ్లు సాధిస్తోంది. కేవలం 10 రోజుల్లో రూ.100 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టిన ఈ చిత్రం, ఇప్పుడు రూ.300 కోట్ల క్లబ్‌లో చేరిపోయింది. భారతీయ చలనచిత్ర చరిత్రలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ సినిమా గా ఇది ఒక మైలురాయిని చేరుకుంది. రూ.15 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా, ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్ల వసూళ్లు సాధించగా ఓవర్సీస్‌లో రూ.26 కోట్లు, ఇండియాలో రూ.276 కోట్లు రాబట్టింది. హోంబలే ఫిల్మ్స్ నిర్మిస్తున్న "మహావతార్ సినిమాటిక్ యూనివర్స్" లో ఇది మొదటి చిత్రం మాత్రమే. మొత్తం 10 విష్ణు అవతారాల ఆధారంగా ఏడు సినిమాలు రూపొందించబోతున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఓ సినిమా విడుదల కానుంది. ఈ సిరీస్‌లో రెండో భాగం "మహావతార్: పరశురామ్"2027లో విడుదల కానుంది. దర్శకుడు అశ్విన్‌కుమార్ వెల్లడించిన ప్రకారం, ఇది మరింత పవర్ ఫుల్‌గా భావోద్వేగభరితంగా విజువల్ ఎక్స్‌పీరియన్స్‌గాఉండనుంది. మహావతార్ నరసింహ సినిమా సాంకేతికంగా ఎంతో ఉన్నతంగా రూపొందించబడగా, కథనంలో కూడా అంతే బలంఉండడంతో సినిమా సూపర్ హిట్ అయింది. విజువల్స్, మ్యూజిక్, పాత్రలడిజైన్, పౌరాణికత ప్రతిదీ ప్రేక్షకులను తడిసిముద్దయ్యేలా చేస్తుంది. ఇది కేవలం యానిమేటెడ్ సినిమా కాదు, భారతీయ మైథాలజీపై ఆధారపడిన భావోద్వేగ పయనం అని చెప్పాలి.ఈ సినిమాను రూ. 15 కోట్ల బడ్జెట్‌తో నిర్మించినట్టు చెప్పారు కానీ అసలు బడ్జెట్ రూ. 40 కోట్లు. మార్కెటింగ్ కూడా కలుపుకుంటే 40 కోట్లకి చేరింది. లాభాలు మాత్రం సినిమాకి భారీగానే వచ్చాయని చెప్పాలి.

# మరో పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న పూర్ణ..





సీమ టపాకాయ్, అవును చిత్రాలతో టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్న నటి పూర్ణ ఇప్పుడు అడపాదడపా సినిమాలు చేస్తూ అలరిస్తూ ఉంది. త్వరలో జైలర్2 చిత్రంతో పలకరించనుంది. కేరళలోని కన్నూర్‌కు చెందిన పూర్ణ, 2004లో మలయాళ సినిమా మంజు పోలోరు పెన్‌కుట్టితో కెరీర్ మొదలెట్టింది. 2007లో శ్రీమహాలక్ష్మి సినిమాతో టాలీవుడ్లో అడుగుపెట్టింది. ఆతరువాత సీమటపాకాయ్ , అవును, లడ్డూబాబు, నువ్విలా నేనిలా,అవును 2,రాజుగారి గది , మమ మంచు అల్లుడు కంచు, జయమ్ము నిశ్చయమ్మురా , సిల్లీ ఫెలోస్, సుందరి, అఖండ, దృశ్యం2, దసరా, భీమ్ వంటి హిట్ సినిమాల్లోను కీలక పాత్రలు పోషించి మెప్పించింది. ప్రత్యేక పాటలలో కూడా అలరించింది. రాజాధిరాజా (తమిళం), శ్రీమంతుడు (తెలుగు), గుంటూరుకారం తదితర చిత్రాల్లోఆమె పాటలుమాస్ హిట్ అయ్యా యి. టీవీ షోలలో కూడా పూర్ణ అదరగొట్టింది. సిక్స్‌సెన్స్, ఢీ వంటి షోలకు హోస్ట్‌గా మెరిసింది. కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే, పూర్ణ దుబాయ్ వాణిజ్యవేత్త షనీద్ అసిఫ్ అలీ ని వివాహమాడింది. 2022లో వీరి వివాహం జరగగా, 2023 ఏప్రిల్ 10న పెద్దగా మగబిడ్డకు జన్మనిచ్చి కుటుంబంతో సంతోషంగా గడుపుతుంది. ఇటీవల పూర్ణ భర్త అసిఫ్ అలీ ఓ ఎమోషనల్ పోస్ట్ షేర్ చేయగా, అది వైరల్ అయింది. 45 రోజులుగా నరకం అనుభవిస్తున్నా. ఒంటరితనం భరించలేకపోయా ను. నీ చిరునవ్వు, ప్రేమే నా బలం అని ఇప్పుడే గ్రహించా.

పెళ్ళైన ఇన్నేళ్ళలో మేము ఎప్పుడూ ఇంత దూరంగా లేము అంటూ ఎమోషన ల్ పోస్ట్ చెప్పాడు పూర్ణ భర్త.ఇక పూర్ణ తాజాగా తనసోషల్ మీడియాలో గుడ్ న్యూస్ చెప్పింది. ఈ శుభవార్తతో మా గుండెల్లో సంతోషం నిండింది. మాకుటుంబంలోకి మరోవ్యక్తి రాబోతున్నారు.కొత్త నవ్వులు, చిన్ని చిన్ని అడుగు జాడలు మా జీవితాలలోకి రాబోతున్నాయి. ఈ సమయంలో శుభవార్తని మీతో పంచుకోవడం ఆనందంగా ఉంది అని తెలియజేస్తూ పూర్ణ రెండో సారి తల్లి కాబోతుందనే గుడ్ న్యూస్ చెప్పింది.ఈ క్రమంలో పలువురు ప్రముఖులు, నెటిజన్స్ ఆమెకు విషెస్ చెప్తూ కామెంట్స్ చేస్తున్నారు. పూర్ణ ఇప్పుడు సినిమాల్లో తక్కువగా కనిపించినా, టీవీ, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంది.

## దక్షిణాది హీరోలు, సౌత్ ఇండస్ట్రీపై జ్యోతిక సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ నటి జ్యోతిక మరోసారి దక్షిణాది సినీ పరిశ్రమపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇక్కడి సినిమా పోస్టర్లలో హీరోయిన్లకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు. పోస్టర్లలో కేవలం హీరోలు మాత్రమే కనిపిస్తారని అన్నారు. ఇటీవల ఓ సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, ఈ అంశంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. బాలీవుడ్, మలయాళ చిత్ర పరిశ్రమల్లో తనకు లభించిన గౌరవాన్ని జ్యోతిక ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. హిందీలో తాను నటించిన 'సైతాన్' సినిమా పోస్టర్‌ను అజయ్ దేవగన్ తన సోషల్ మీడియాలో పంచుకున్నారని తెలిపారు. అలాగే, మలయాళంలో సూపర్‌స్టార్ మమ్ముట్టితో నటించిన 'కాథల్–ది కోర్' చిత్ర పోస్టర్‌లోనూ తన ఫోటో ఉందని, ఆ పోస్టర్‌ను మమ్ముట్టి కూడా షేర్ చేశారని ఆమె వివరించారు.



# కిచ్చా సుదీప్ యాక్షన్ థ్రిల్లర్..

## గ్లింప్స్‌తో పెరిగిన అంచనాలు





కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ తెలుగు ప్రేక్షకులకి కూడా చాలా సుపరిచితం. ఈగ చిత్రంలో విలన్‌గా నటించి అశేష ప్రేక్షకాదరణ పొందాడు. సెప్టెంబర్ 1న కిచ్చా సుదీప్ 51వ వసంతంలోకి అడుగు పెట్టగా, ఆయనకి అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షల వెల్లువెత్తాయి. తెలుగు ప్రేక్షకులకు 'ఈగ' సినిమాతో విలన్‌గా పరిచయమైనప్పటికీ, ఆ తర్వాత హీరోగా కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు సుదీప్. ప్రస్తుతం వరుససినిమాలతో బిజీగా ఉన్నాడు. ఈ సందర్భంగా ఆయన నటిస్తున్న 47వ సినిమా నుంచి ఒక ప్రత్యేక గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. గ్లింప్స్‌తో పాటు సినిమా టైటిల్‌ను కూడా ప్రకటించారు. మార్క్ అనే టైటిల్‌ని ఫిక్స్ చేయగా, సుదీప్ పుట్టినరోజును పురస్కరించుకుని గ్లింప్స్ విడుదల చేశారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.విజయ కార్తికేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సెంధిల్ త్యాగరాజన్ – అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. రీసెంట్‌గా విడుదలైన గ్లింప్స్‌లో సుదీప్ పాత్రను ఒక్కో లక్షణంతో పరిచయం చేశారు. మ్యాడ్, యాటిట్యూడ్, రూత్‌లెస్, కింగ్ అని చెబుతూ చివర్లో అతని పాత్రకు అసలైన పేరు అజయ్ మార్కండేయ అని చూపించి, ఆ పేరులోని అక్షరాలను ఆధారంగా తీసుకుని టైటిల్‌ను '%హీూ=ఖ%' గా ఖరారు చేశారు. వీడియోలో సుదీప్ పవర్‌ఫుల్ లుక్‌తో కనిపించగా, విలన్స్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే మాస్ క్యారెక్టర్‌గా కనిపించారు. ఇది పూర్తిగా యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. పుట్టినరోజున ఇలా తన సినిమా నుంచి కీలక అప్డేట్ ఇవ్వడం ద్వారా సుదీప్ అభిమానులకు ఓ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చినట్టే అయింది. మరి ఈ సినిమా సుదీప్ కెరీర్‌లో మరో హిట్గా నిలుస్తుందా లేదా అనేది వేచి చూడాలి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ దాదాపు 60% పూర్తవగా.. అక్టోబర్ నాటికి మొత్తం పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు సుదీప్ తెలిపారు. క్రిస్మస్ పండుగ కానుకగా ఈ చిత్రం థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ ప్రాజెక్ట్ తో పాటు 'బిల్లా రంగా బాషా' అనే మరో ప్రాజెక్ట్ కూడా చేస్తున్నారు .

# తల్లి మూవీ రీమేక్ చేస్తున్న జాన్వీ కపూర్..!



అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల కూతురు జాన్వీ కపూర్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. చూడ చక్కని అందం, ఆకట్టుకునే అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. అయితే ఈ అమ్మడికి ఇప్పటి వరకు ఒక్కపెద్ద హిట్ కూడా రాలేదు. సినిమాల కన్నా గ్లామర్ షోతోనే జాన్వీ ఎక్కువగా వార్తలలో నిలుస్తూ ఉంటుంది. టాలీవుడ్‌కి దేవర చిత్రంతో ఎంట్రీ ఇవ్వగా, ఇప్పుడు రామ్ చరణ్‌తో పెద్ది అనే మూవీ చేస్తుంది. ఈ సినిమాపై చాలా ఆశలే పెట్టుకుంది జాన్వీ కపూర్. మరోవైపు తన తల్లి నటించిన చిత్రాన్ని జాన్వీ కపూర్ రీమేక్ చేయనుందట. ఇప్పుడు ఈ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. నాలుగు దశాబ్దాల క్రితం శ్రీదేవి హీరోయిన్‌గా నటించిన బాలీవుడ్ చిత్రం 'చాల్‌బాజ్' . 1989లో విడుదలై సంచలన విజయం సాధించిన ఈ చిత్రం శ్రీదేవికి కెరీర్‌లో మైలురాయి అయ్యింది. పంకజ్ పరాశర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో శ్రీదేవి ద్విపాత్రాభినయం చేయగా, ఆమెతో పాటు రజనీకాంత్, సన్నీ డియోల్ కీలక పాత్రల్లో నటించారు. కామెడీ, యాక్షన్, ఎమోషన్స్ అన్నీ కలగలసిన ఈ చిత్రం అప్పట్లో బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు అందుకుంది. ఈ సినిమా రీమేక్ పై పనులు మొదలైనట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తుంది. ఇందులో శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ ప్రధాన పాత్రలో నటించనున్నారని సోషల్ మీడియాలో కథనాలు ఊపందుకున్నాయి. ఈ ప్రాజెక్టు ఫైనల్ స్టేజ్‌లో ఉండగా, అధికారిక ప్రకటన ఈనెలాఖరులో వెలువడే అవకాశం ఉందని సమాచారం. తల్లి నటించిన చిత్రాల్లో తనకు 'ఛాల్‌బాజ్' మూవీనే ఇష్టమని పలు ఇంటర్వ్యూలలో చెప్పిన జాన్వీ, ఇప్పుడు అదే సినిమాలో నటించేఅవకాశం రావడం పట్ల ఎంతో సంతోషంగా ఉందని సన్నిహి తులు చెబుతున్నారు. అయితే, ఈ రీమేక్ కథలో మార్పులు చేస్తారా? మౌలికంగా అదే ఫార్మాట్ కొనసాగుతుందా? దర్శకుడు ఎవరు? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. పాత తరానికి జ్ఞాపకాలని అందిస్తూ , కొత్త తరానికి నూతన అనుభూతి ఇచ్చేలా ఈ రీమేక్ ఉంటుందని అంచనాలు మొదలయ్యాయి. ఈ వార్తలపై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందా అని అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215